


RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:34 WEDNESDAY,JULY 1,2026 PAGES:12 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :34 బుధవారం, జూలై 1, 2026, పేజీలు -12 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## రైతన్నలకు గుడ్‌న్యూస్..

## రైతు భరోసా నిధులు విడుదల మీకు వచ్చాయా

**తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఎప్పుడెప్పుడా అని వేచి చూస్తున్న సమయం రానే వచ్చింది**



తెలంగాణ పత్రిక ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం వానా కాలం పెట్టుబడి సాయం కింద అందిస్తున్న రైతుభరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. తొలి విడతలో భాగంగా మొత్తం రాష్ట్రవ్యాప్తంగా రెండు ఎకరాల్లోపు సుమారు 44.28 లక్షలమంది రైతుల ఖాతాల్లో రూ. 2,482.02 కోట్ల నిధులు జమ చేసింది తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న మిగతా2లో

## విజయవాడ బైపాస్ లో ఘోర రోడ్డు ప్రమాదం..

-బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
-రెండు లారీల మధ్య నలిగిపోయి నుజ్జునుజ్జయిన కారు 2
-ఓ స్కూటరిస్టుకు కూడా ప్రమాదం
-ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి, ఒకరి పరిస్థితి విషమం
-అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక నిర్ధారణ
-ఘటనాస్థలిలో భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్


12

## అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు..

జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు.



## భూ యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి

తెలంగాణ పత్రిక: స్థలాలు ఎవరికి కేటాయించినప్పటికీ, ఆయా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు మాత్రం ఆలయాలకే ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సమగ్ర అభివృద్ధి, భూ కేటాయింపులపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మిగతా2లో

## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్

12




## మిగులు బడ్జెట్ తో తెలంగాణ రాష్ట్రం ఇస్తే..

- రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టిండు..
- 60 ఏళ్లలో 18 మంది ముఖ్యమంత్రులు 69000 కోట్ల అప్పు చేస్తే..
- కేవలం 10 ఏళ్ల పాలనలో కేసీఆర్ అక్షరాల 7 లక్షల పై చిలుకు అప్పు చేసిండు..
- నేను ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన నాడు తెలంగాణ అప్పు 8 లక్షల 11 వేల కోట్లు.


-- సీఎం రేవంత్ రెడ్డి

## జులై 2న తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

**మధ్యాహ్నం 3 గంటలకు రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ**
**ఈరోజు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన చీఫ్ సెక్రటరీ**
**ఉన్నతాధికారులంతా కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని ఆదే**

తెలంగాణ పత్రిక: తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం మిగతా2లో

## ధాన్యం ఉత్పత్తి, సేకరణలో దేశంలోనే తెలంగాణ టాప్




తెలంగాణ పత్రిక: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో విధ్వంసం చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన రైతు భరోసా సభలో మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం మిగతా2లో




## భద్రాద్రి కొత్తగూడెంలో ఈగల్ ఫోర్స్ మెరుపు దాడి

తెలంగాణ పత్రిక: జిల్లాలో ఈగల్ ఫోర్స్, స్థానిక పోలీసులు.. భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేశారు. సారపాక ఐటీసీ వెస్ట్ గేట్ సమీపంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఒడిశా అడవుల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నిందితులు మిగతా2లో

## హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరణకు ఆహ్వానం



హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరించండి.. సునీల్ మిట్టల్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం

సీఎం రేవంత్‌తో సునీల్ మిట్టల్ భేటీ డిజిటల్, క్లౌడ్, ఏఐ రంగాలపై దృష్టి పెట్టాలని సూచన

తెలంగాణ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా వివరణ

తెలంగాణ పత్రిక: తెలంగాణలో డిజిటల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ రంగాల్లో మిగతా2లో




## భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి..

-తెలంగాణలో సర్వర్లు డౌన్!
-రెండు రోజులుగా పనిచేయని సర్వర్లు!
-స్తంభించిన స్లాట్ బుకింగ్, చలాన్, ఈ-కేవైసీ సేవలు
-కార్యాలయాల వద్ద ప్రజలు పడిగాపులు
-మూడు నెలల్లో ఇది నాలుగోసారి
-సర్వర్ల పునరుద్ధరణకు సాంకేతిక బృందం కసరత్తు

## మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుంది



రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ,కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి

తెలంగాణ పత్రికదఆదిలాబాద్ జిల్లా బ్యూరో : రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూత ఇస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ,కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి మిగతా2లో

## రాజాసింగ్‌కు నాంపల్లి ప్రత్యేక కోర్టులో భారీ ఊరట


2

- 2022లో మునావర్ ఫారూఖీ షోను వ్యతిరేకించిన రాజాసింగ్

దేశవ్యాప్తంగా దుమారం రేపిన రాజాసింగ్ వీడియో

## తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు



సిగాచి పరిశ్రమలో 54 మంది కార్మికులు సజీవదహనమైన ఘటనను గుర్తు చేసుకున్న హరీశ్

20 కిలోమీటర్ల దూరంలో ఉన్నా రేవంత్ రెడ్డి రాలేదని విమర్శ

మృతి చెందిన కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దని వ్యాఖ్య

తెలంగాణ పత్రిక: తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి పరిశ్రమలో కూలి కోసం వలస వచ్చిన 54 మంది పేద కార్మికులు సజీవదహనమైన ఘోర ఘటనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయన మిగతా2లో

# రైతన్నలకు గుడ్‌న్యూస్.. రైతు భరోసా నిధులు విడుదల మీకు వచ్చాయా

ఎదురుచూస్తున్న రైతన్నలకు రేవంత్ సర్కార్ అదిరిపోయే శుభవార్త చెప్పింది. వానాకాలం సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం అధికారికంగా విడుదల చేశారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన రైతు భరోసా సదస్సులో పాల్గొన్న ఆయన బటన్ నొక్కి నిధుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులకు ఖాతాల్లో మూడు విడతల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయల జమ చేయాలనే లక్ష్యం పెట్టుకున్న ప్రభుత్వం మంగళవారం తొలి విడతగా రెండు ఎకరాల్లోపు ఉన్న రైతులకు ఖాతాల్లో నిధులు జమ చేసింది. అంటే ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిన్న, సన్నకారు రైతుల ఖాతాల్లో నిధులు జమ అయ్యారు. ఇక తొలి విడతలో భాగంగా మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 2 ఎకరాల లోపు భూమి ఉన్న సుమారు 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం కింద రూ. 2,482.02 కోట్ల జమ చేశారు. ఇందులో ఒక ఎకరం లోపు ఉన్న రైతులు 14.65 లక్షల మంది ఉండగా.. వారి ఖాతాల్లో రూ. 878.94 కోట్లు, రెండు ఎకరాల లోపు ఉన్న రైతులు 26.72 లక్షల మంది ఉండగా వారి ఖాతాల్లో రూ. 1,603.08 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి జూలై 5 వరకు ఛాన్స్ ఇదిలా ఉండగా ఇప్పటివరకు రైతు భరోసా జాబితాలో పేరు నమోదు కాని వారు లేదా జూన్ 15 లోపు కొత్తగా పట్టాదారు పాస్‌బుక్ పొందిన రైతులకు ప్రభుత్వం మరో ఛాన్స్ కల్పించింది. అర్హులైన కొత్త రైతులు అవసరమైన ధ్రువపత్రాలను తమ గ్రామంలోని ఏఈవోకు అందజేసి పథకానికి ధరఖాస్తూ చేసుకోవాలని సూచించింది.

# భూ యాజమాన్య హక్కులు ఆలయాలకే ఉండాలి: సీఎం రేవంత్

ఈ సందర్భంగా ఆలయ భూముల పరిరక్షణ, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన నిర్మాణాలపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు భూమి కేటాయింపు విషయమై స్పందిస్తూ, సదరు ల్యాండ్‌ను ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారమే కేటాయించాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే, ఆలయ పరిధిలో వివిధ మఠాలకు స్థలాలు ఇచ్చే అంశంపై స్పష్టమైన, పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపులపై కూడా నిర్దిష్ట నిబంధనలతో కూడిన ఒక పాలసీని సిద్ధం చేయాలని చెప్పారు. ఈ భూ కేటాయింపుల ప్రక్రియలో దేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనుసరిస్తున్న నిబంధ నలు, విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్టపై భక్తుల వసతి కోసం నిర్మించతలపెట్టిన అతిథిగృహాల నిర్మాణంలోనూ తిరుమల మోడల్‌నే అనుసరించాలని పేర్కొన్నారు. కొండపై కాటేజీలు, గెస్ట్‌హౌస్‌ల నిర్మాణం చేపట్టేం దుకు ఆసక్తి చూపే దాతలు, సంస్థల వివరాలతో కూడిన జాబితాను తక్షణమే రూపొందిం చాలని, వీరికి విడతలవారీగా నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో ఒక ప్రత్యేక టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక యాదగిరిగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులు, నాణ్యతపై గతంలో నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, దానిపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను తనకు అందజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు డెడ్‌లైన్ విధించారు.

# హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ విస్తరణకు ఆహ్వానం

తెలంగాణలో డిజిటల్ రంగంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని భారతి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ రంగాల్లో కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధీ పెవిలియన్‌లో రేవంత్ రెడ్డిని మంగళవారం సునీల్ భారతి మిట్టల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడులకు అనుకూలంగా తీసుకొచ్చిన సంస్కరణలపై సీఎం వివరించారు. రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూల గమ్యస్థానంగా మారుతోందని పేర్కొన్న సీఎం విద్యా రంగంలో చేపడుతున్న మార్పులను కూడా వివరించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు తగ్గట్టుగా యువతకు నైపుణ్యాలు అందించేందుకు ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ గురించి కూడా సునీల్ మిట్టల్‌కు వివరించారు. అలాగే ఐటీఐలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీలు) మారుస్తున్నట్లు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను కూడా ఆధునికీకరిస్తున్నామని, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో సాంకేతిక రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఎయిర్‌టెల్ కూడా తన కార్యకలాపాలను మరింత విస్తరించాలని కోరారు.

# మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం చేయూతనిస్తుంది

గ్రామంలో 15 లక్షల రూపాయల డి ఎం ఎఫ్ టి 2022-23 నిధులతో గ్రామైక్య సంఘ భవనం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా వివిధ వ్యాపార రంగాలలో మహిళా భాగస్వామ్యాన్ని స్వాగతిస్తూ అవసరమైన రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహిస్తుందని, మహిళా సంక్షేమంలో భాగంగా అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.మహిళను కుటుంబ పెద్దగా గుర్తిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాల ద్వారా లబ్ది చేకూర్చడం జరుగుతుందని తెలిపారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, రాష్ట్రంలో 21 వేల కోట్ల రూపాయలు స్వయం సహాయక సంఘాలకు అందించడం జరిగిందని తెలిపారు. రుణ సదుపాయం పొందిన స్వయం సహాయక సంఘాలు సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే మరింత రుణం పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో విద్య అభ్యసించే విద్యార్థులకు ఏకరూప దుస్తుల తయారీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. పెట్రోల్ బంకుల ఏర్పాటు, నిర్వహణకు మహిళా సంఘాలకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయబడి వచ్చే నెలాఖరుకు దాదాపు 1 వేయి ఇండ్లు పూర్తి కానున్నాయని, మిగతావి పురోగతిలో ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డుదారులకు చౌక ధరలు దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ జిల్లాలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు.వైద్యరంగంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రులను ఏర్పాటు చేసి వైద్య సేవలు మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 5 లక్షల రూపాయల పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంపొందించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.వచ్చే నెల నుండి పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను సరిదిద్దుతూ రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాలను అధికారుల సమన్వయంతో జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు,వివిధ వ్యాపారాలలో మహిళల భాగస్వామ్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, గుడిసెలలో ఉండేవారు, అర్హులైన నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవన్ ఏర్పాటు చేయడం జరిగిందని,జిల్లాలోని పలు ప్రాంతాలలో మహిళ భవనాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మహిళా సంఘాల సమావేశాలు,ఇతర పనులకు వినియోగించుకోవచ్చని తెలిపారు.మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు.అనంతరం విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.అంతకుముందు జిల్లా కలెక్టర్,మండల తహసిల్దార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. జూలై 24వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, పూరించిన తర్వాత సేకరించాలని,ఫారాల పంపిణీ ప్రక్రియను జూలై 1వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు.ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరించి,ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదై ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టరీత్యా శిక్షార్హమని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.బూత్ స్థాయి అధికారులు బి.ఎల్.ఓ. యాప్‌ను తప్పనిసరిగా వినియోగించాలని, ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించిన అనంతరం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి అయిన స్టిక్కర్‌ను ప్రతి ఇంటికి అతికించాలని, ఫారాల పూరణ,సమర్పణపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రాజాసింగ్‌కు నాంపల్లి ప్రత్యేక కోర్టులో భారీ ఊరట

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును కోర్టు పూర్తిగా కొట్టివేస్తూ, రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు తుది తీర్పునిచ్చింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... 2022 ఆగస్టులో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ షో నిర్వహించడాన్ని రాజాసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఆయన యూట్యూబ్‌లో విడుదల చేసిన ఒక వీడియో దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. రాజాసింగ్ మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై 153ఏ, 295ఏ, 505(2) తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 2022 ఆగస్టు 23న పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసినప్పటికీ, అరెస్ట్ ప్రక్రియలో సరైన నిబంధనలు (41ఏ సీఆర్‌పీసీ నోటీసు వంటివి) పాటించలేదంటూ స్థానిక కోర్టు రిమాండ్‌ను తిరస్కరించి, ఆయనను వెంటనే విడుదల చేసింది. అయితే, ఆ తర్వాత నగరంలో చోటుచేసుకున్న నిరసనలు, శాంతిభద్రతల సమస్యలను కారణాంగా చూపిస్తూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు ఆయనపై పీడీ యాక్ట్ ప్రయోగించారు. దీంతో రాజాసింగ్ దాదాపు 77 రోజుల పాటు జైలులో గడపాల్సి వచ్చింది.

## విజయవాడ బైపాస్ లో ఘోర రోడ్డు ప్రమాదం..

వివరాల్లోకి వెళితే, విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఓ కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ బలం గా ఢీకొట్టింది. ఈ ధాటికి కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ లారీని బలంగా గుద్దుకుంది. రెండు లారీల మధ్య కారు పూర్తిగా నలిగి పోయి నుజ్జు నుజ్జ యింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న తల్లి, బిడ్డ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోవడం అం దరినీ కలచి వేసింది. కారులో ఉన్న మరో వ్యక్తి ఈ ప్రమాదంలో రెండు చేతులు కోల్పో యి, తీవ్ర రక్తస్రావంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. అదే సమయంలో, రోడ్డుపై వేగంగా వచ్చిన ఓ స్కూటరిస్ట్ కూడా ప్రమా దానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

అదుపుతప్పిన ఆయిల్ ట్యాంకర్ లారీ... స్కూటరిస్టును ఢీకొట్టింది. దాంతో అతడు అక్కడిక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న గన్నవరం పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాల ను తొలగించి, రాకపోకలను పునరుద్ధరించా రు. మృతదేహాలను, క్షతగాత్రుడిని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జులై 2న తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగబోతోంది. సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్‌లో జరిగే ఈ 34వ మంత్రిమండలి భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈరోజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సచివాలయంలో పరిపాలనా పరమైన హడావుడి మొదలైంది. ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు. ఈ ప్రతిపాదనలను తెలుగు అనువాదంతో సహా రేపు మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సాధారణ పరిపాలన (కేబినెట్) శాఖకు పంపాలని సీఎస్ ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ ఏ శాఖలోనైనా ఎలాంటి అజెండా అంశాలు లేకపోతే.. 'నిల్' రిపోర్టునైనా సరే నిర్ణీత సమయానికి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. మరోవైపు, సమావేశం జరిగే సమయంలో ఎలాంటి సాంకేతిక లేదా పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తుగా గట్టి చర్యలు చేపట్టింది. కేబినెట్ భేటీ ముగిసే వరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్యదర్శులందరూ కచ్చితంగా తమ కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. దీంతో పాటు ప్రొటోకాల్ డైరెక్టర్, హార్టికల్చర్ డైరెక్టర్, ట్రాన్స్‌లేషన్స్ డైరెక్టర్, ు+టూ యూనిట్ మేనేజర్లు సమావేశానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశించారు.

## ధాన్యం ఉత్పత్తి, సేకరణలో దేశంలోనే తెలంగాణ టాప్

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షలలోపు రైతు రుణాలను మాఫీ చేశామని మంత్రి తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రైతుల ఖాతాల్లో రూ.22 వేల కోట్లకు పైగా జమ చేసినట్లు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని అన్నారు. రైతు సమస్యలను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. 'కేసీఆర్ ఒక్క రైతుబంధు ఇచ్చి.. అన్నీ బంద్ చేశారు' అంటూ మంత్రి తుమ్మల వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం నిధులు అందించే పలు వ్యవసాయ పథకాలను కూడా అప్పటి ప్రభుత్వం అమలు చేయకుండా నిలిపివేసిందని ఆరోపించారు. తెలంగాణ ప్రస్తుతం ధాన్యం ఉత్పత్తి, ధాన్యం సేకరణలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని మంత్రి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఆయిల్‌పామ్ సాగులో కూడా తెలంగాణను దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులకు ఎరువుల పంపిణీ, వ్యవసాయ సేవలను మరింత పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ మంచి ఫలితాలు ఇస్తోందని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే తరహా యాప్‌ను తీసుకొస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.. తెలంగాణలో సర్వర్లు డౌన్!

తెలంగాణ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయాయి. సాంకేతిక లోపాలతో ప్రధాన సర్వర్లు గత రెండు రోజులుగా పనిచేయడంలేదని తెలుస్తోంది. భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. దీంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్లు పనిచేయకపోవడంతో కొత్త స్లాట్ బుకింగ్‌లు, చలాన్ చెల్లింపులు, ఈ-కేవైసీ వంటి ఆన్‌లైన్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగానే ముహూర్తాలు చూసుకుని స్లాట్‌లు బుక్ చేసుకున్న క్రయ, విక్రయదారులు సాక్షులతో కలిసి కార్యాలయాలకు చేరుకున్నా, గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత మూడు నెలల్లో సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. తరచూ ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపం ఎక్కడ తలెత్తిందనే విషయంపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా సమాచారం లేదు. వారు ప్రజలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దీంతో కార్యాలయాల వద్ద గందరగోళం నెలకొంది. సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన సమస్యను గుర్తించి సర్వర్లను పునరుద్ధరించేందుకు రాష్ట్ర స్థాయి సాంకేతిక బృందం చర్యలు చేపట్టిందని ఉన్నతాధికారులు తెలిపారు. సేవలు ఎప్పటికి పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తారనే విషయంపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.

## తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో 2025 జూన్ 30వ తేదీ ఒక చీకటి రోజు

సీఎం రేవంత్ రాకపోవడం, బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవకపోవడం హృదయవిదారకమన్నారు. విమర్శలు రావడంతో మరుసటి రోజు వచ్చారని విమర్శించారు. రేవంత్ రెడ్డి మృతదేహాల సాక్షిగా ప్రతి కుటుంబానికి రూ.1 కోటి ఇస్తానని ప్రకటించినా, ప్రభుత్వం తరపున కేవలం రూ.1 లక్ష మాత్రమే ఇచ్చింది. కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్స్యూరెన్స్, వైద్య ఖర్చులను కూడా పరిహారంలో చేర్చి మోసం చేశారని ఆరోపించారు. డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పడం, ఉద్యోగాలు ఇవ్వకపోవడం, క్షతగాత్రులకు సహాయం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఘటన సామూహిక హత్య అని, 818 నూకి అనుమతి తీసుకుని 1777 నూ నడపడం, సేఫ్టీ గార్డ్స్, ఫైర్ చీూజ, డస్ట్ కంట్రోల్ వ్యవస్థ లేకపోవడం వంటి నిర్లక్ష్యాలు విచారణలో తేలాయన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడం, ఎండీని అరెస్టు చేసి వెంటనే బెయిల్‌పై విడుదల చేయడం లోపాయికారీ ఒప్పందాన్ని సూచిస్తుందని విమర్శించారు. సిగాచి డైరెక్టర్ల ఆస్తులను అటాచ్ చేసి కోటి రూపాయల పరిహారం తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. "మాట తప్పడం మీకు అలవాటే కానీ, ప్రాణాలు కోల్పోయిన పేద కార్మికుల కుటుంబాలను మోసం చేయవద్దు" అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో ఈగల్ ఫోర్స్ మెరుపు దాడి..

ఈ క్రమంలో ఒడిశా అడవుల నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. నిందితులు పోలీసుల కళ్లు గప్పేందుకు లారీలో ప్రత్యేకంగా ఒక రహస్య భాగాన్ని ఏర్పాటు చేసి అందులో గంజాయిని దాచి తరలిస్తున్నారు. అయితే చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు లారీని సోదా చేసి, దాదాపు 525 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ గంజాయి విలువ మార్కెట్లో సుమారు 2.62 కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంయుక్త ఆపరేషన్‌లో పోలీసులు ముగ్గురు నిందితులను ఘటనా స్థలంలోనే అరెస్ట్ చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగిస్తున్న లారీతో పాటు, దానికి ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తున్న ఒక పల్సర్ బైక్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు నిందితుల వద్ద ఉన్న 5 మొబైల్ ఫోన్లు, రూ.10,570 నగదును పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# యూరియా యాప్ ను వెంటనే రద్దు చేయాలి

-రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి
-అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) డిమాండ్

తెలంగాణ పత్రిక దమ్మపేట జూన్ 30



రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యూరియా యాప్ ను రద్దు చేయాలని ,కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వం వారికి అన్ని అవకాశాలు కల్పించాలని, తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కి ఇవ్వటం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకురాలు తోడం దుర్గమ్మ,అఖిలభారత ఐక్య రైతు సంఘం డివిజన్ అధ్యక్షులు పందూరి వీరబాబు లు మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్న రైతులకు అవసరమైన విత్తనాలు ఎరువులు పరిపూర్తిగా లభించడం లేదన్నారు అరకొరగా కురిసిన వర్షానికి విత్తిన విత్తనాలు మొలవక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వర్షాభావ పరిస్థితులవలన వర్షాలు ఆలస్యం వల్ల ఖరీఫ్ కూడా ఆలస్యంగా ప్రారంభమైందని అన్నారు రైతులు యూరియా యాప్ ద్వారా యూరియా డిఎపి కాంప్లెక్స్ ఎరువులు సకాలంలో అందటం లేదన్నారు వీరి కి అవసరమైన మేరకు ఎరువులను పెట్టుబడికై బ్యాంకు రుణాలను తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం విత్తనాలు ఎరువులు యూరియా డిఏపి తో పాటు కాంప్లెక్స్ ఎరువులు సబ్సిడీపై ఇవ్వాలని,కేంద్ర ప్రభుత్వం పెంచిన యూరియా డిఏపి కాంప్లెక్స్ దారులను తగ్గించి సబ్సిడీలను కొనసాగించాలని కోరారు. రైతాంగానికి ఇచ్చినటువంటి హామీల ప్రకారంగా పంటలకు మద్దతు ధరలు(ఎం ఎస్ పి) చట్టం చేయాలని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, పంట కొనుగోలు పరిమితులను విధిస్తే రైతులు నష్టపోతారన్నారు. అదే విధంగా ఖరీఫ్ రైతు భరోసా సకాలంలో ఇవ్వవలసిన ప్రభుత్వం నేటికీ విడుదల చేయలేదన్నారు ఒకే దఫాలో రైతు భరోసా చెల్లించాలని, గత బకాయిలను కూడా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు గతంలో వరి పంటలు అమ్మిన రైతాంగానికి వరి కొనుగోలు చేసిన బిల్లులు మరియు,బోనస్ లన్నిటిని చెల్లించడం లేదన్నారు కొన్నిచోట్ల చెల్లింపులు జరిగిన జాప్యం జరుగుతున్నాయని బకాయిలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి కురసం ముత్యాలరావు, అఖిలభారత ఐక్య రైతు సంఘం మండల అధ్యక్షుడు కుంజా కాంతారావు, మండల నాయకులు పూజల సంజీవరావు, భద్రం, సున్నం జగన్, శీలం రాంబాబు, గంగాధర నాగమణి, కుప్పాల నాగరాజు, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు

# సర్పంచ్ సమన్వయ సమావేశాలు నిర్వహించాలి

-ఎంపీడీవోకు సర్పంచుల వినతి

జగిత్యాల రూరల్,తెలంగాణ పత్రిక,జూన్ 30:



జగిత్యాల రూరల్ మండలంలోని గ్రామ సర్పంచులు మంగళవారం ఎంపీడీవోను కలిసి మండల సర్వసభ్య (సమన్వయ) సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ, తాము పదవీ బాధ్యతలు స్వీకరించి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు ఒక్క మండల సర్వసభ్య సమావేశం కూడా నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, నిధుల కేటాయింపు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడానికి మండల స్థాయి సమావేశాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు ప్రతి నెలా మండల సర్వసభ్య సమావేశాలను నిర్వహించాలని, గ్రామపంచాయతీలకు అవసరమైన నిధులను విడుదల చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవోను కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు రాజేందర్, సతీష్, మహేష్, గంగన్న, వంశీ, రవి, కవిత, స్వామిరెడ్డి, లక్ష్మి, రాధ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక సమస్యలు పరిష్కరించాలి

-నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలి : సిఐటియు మండల కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్
-సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతిపత్రం

పాలకుర్తి/తొర్రూరు(తెలంగాణ పత్రిక) ప్రతినిధి పున్నం సారయ్య :



కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తొర్రూరు మండల ఎమ్మార్వోకు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి జమ్ముల శ్రీను మాట్లాడుతూ...భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దని, కార్మికులకు అవసరం లేని వైద్య పరీక్షలను నిర్వహించకూడదని కోరారు. సహజ మరణం చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని, 55 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రతి కార్మికుడికి నెలకు రూ.6 వేల పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, గత ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందజేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇండ్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల మండల అధ్యక్షుడు పల్లె వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యులు తిమ్మిడి రవి, మారుపెల్లి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఎస్పీ రోహిత్ రాజు ఘన సన్మానం







భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 30

పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా 37 సంవత్సరాల పాటు పోలీసు శాఖలో సేవలందించిన మల్లెంపాటి తిరుమలరావు, పెయ్యాల ప్రసాద్, సాలి పాపయ్య, అలాగే 36 సంవత్సరాల పాటు విశిష్ట సేవలందించిన మట్టూరి సత్యనారాయణ, కుప్పా వెంకట విశాల్ కుమార్ పదవీ విరమణ పొందారు. వీరికి జిల్లా ఎస్పీ శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అధికారులు తమ పోలీసు సేవా అనుభవాలను పంచుకున్నారు. వారి కుటుంబ సభ్యులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు ప్రజలకు అంకితభావంతో సేవలందించిన అధికారులను నూతన పోలీసు సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. వ్యాయామం, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను కొనసాగించాలని సూచించారు. పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్, లాల్ బాబు, కృష్ణారావు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుళ్లకు పోలీస్ శాఖ ఆత్మీయ వీడ్కోలు



సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30, తెలంగాణ పత్రిక

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్‌బీలో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణయ్య, కొనరావుపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ అలీ పదవీ విరమణ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ శాఖలో వారు సుదీర్ఘకాలం అంకితభావంతో, నిజాయితీగా విధులు నిర్వహించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు.పోలీస్ శాఖలో వారి సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలుస్తాయని అదనపు ఎస్పీ పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమేనని, వ్యక్తిత్వానికి కాదని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా వారికి లేదా వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుళ్లు వెంకటరమణయ్య, మహబూబ్ అలీతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన లైబ్రేరియన్ రాజారాంకు ఘన సన్మానం



నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 30 (తెలంగాణ పత్రిక)

మామడ మండల కేంద్రంలో లైబ్రేరియన్‌గా సేవలందించి పదవీ విరమణ పొందిన పగడం రాజారాంను కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజారాం తన సేవా కాలంలో గ్రంథాలయ అభివృద్ధికి విశేష కృషి చేసి, విద్యార్థులు, యువతలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన సేవలు సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొని యువతకు మార్గదర్శకుడిగా నిలవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొని రాజారాంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రిన్సిపాల్‌కు గ్రామస్తుల సన్మానం



ఇల్లంతకుంట జూన్ 30 తెలంగాణ పత్రిక

ఇల్లంతకుంట మండలంలోని రహీంఖాన్ పేట గ్రామ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గూడెల్లి ఆంజనేయులు ఇటీవల అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ బిల్లవేని పరుశురాం, బత్తిని స్వామి, చేర్ల శ్రీనివాస్, ఉత్కం పరుశురాం, పెంకాసుల రమేష్, బత్తిని మహేందర్, రిపోర్టర్లు దొంతి సుధాకర్, కత్తి బాలయ్య తదితరులు శాలువాతో సత్కరించారు.

# విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం







-ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న సర్కార్
-రాచర్ల బొప్పాపూర్ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన తరగతి గదులు ప్రారంభం
-స్కూల్ అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యన్న

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30, తెలంగాణ పత్రిక

విద్యా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పాఠశాల పూర్వ విద్యార్థి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని వసతులతో ఉత్తమ విద్యా సంస్థలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన తరగతి గదులను మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అలాగే ఉద్యోగ విరమణ పొందుతున్న జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడిని సన్మానించి వారి సేవలను కొనియాడారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మెరుగైన బోధన, వసతుల కారణంగా తల్లిదండ్రులు ఈ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. ప్రస్తుతం 400 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తనకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి ముందుకు సాగాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని, మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ వంటి అంశాల్లో బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.పాఠశాల అభివృద్ధిపై సీఎం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాఠశాల పూర్వ విద్యార్థి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. రాచర్ల బొప్పాపూర్ పాఠశాల ఎంతో మంది విద్యార్థుల జీవితాలకు పునాది వేసిందని గుర్తు చేశారు. ఈ పాఠశాలలో చదివిన అనేక మంది ప్రస్తుతం దేశ విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని తెలిపారు.ఉపాధ్యాయుల మార్గదర్శనం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాము ఎదిగామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సమానంగా భావించి, ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యాశాఖను మరింత అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. రాచర్ల బొప్పాపూర్ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ. లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ పాఠశాల అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సబేరా బేగం, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, సర్పంచ్ గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

## చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు నూతన భవనం మంజూరు చేయాలి సీపియం



చండూరు తెలంగాణ పత్రిక జూన్ 30

చండూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం శిథిలా వ్యవస్థకు చేరుకుందని, ప్రభుత్వం వెంటనే నూతన బిల్డింగు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం అన్నారు. మంగళవారంచండూరు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమగ్ర సర్వే నిర్వహించి అక్కడి సమస్యలపై అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు పడకలు ఉన్నాయని, రోగుల సంఖ్య ఎక్కువ ఉన్నందున ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు బదులు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని ప్రస్తుతం ఏఎన్ఎంలు 18 మంది ఉండగా, 17 మంది పనిచేస్తున్నారని, ఒకరు మాత్రం వేరొక చోటుకు బదిలీపై వెళ్లారని ఆయన అన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. చండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరు పడకల ఆసుపత్రి నుంచి 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని, కాళీ పోస్టులను భర్తీ చేసి అవసరమైన పందులు ఎక్కువగా సరఫరా చేయాలన్నారు. మండల పరిధిలోని ఇద్దరు ఆశా వర్కర్లు ఖాళీ అయినందున ప్రభుత్వం వెంటనే ఆ పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చండూరు మండల కార్యదర్శి ధనంజయ, సిపిఎం మండల కమిటీ సభ్యులు వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్స్ టి సంధ్య బ్లెస్సి మేడం, డాక్టర్ మాస రాజు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం, మంచి విద్య అందించాలి తహసీల్దార్ సురేష్



ఇల్లంతకుంట జూన్ 30 ఇల్లంతకుంట

విద్యార్థులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజనంతో పాటు మంచి విద్యను అందించాలని ఇల్లంతకుంట తహసీల్దార్ రాచకట్ల సురేష్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తే ఆరోగ్య సమస్యలు దరిచేరవని, చదువుపై పూర్తి శ్రద్ధ పెట్టగలరని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ: నరేందర్

తానూర్:జూన్30(తెలంగాణ పత్రిక)



ఝరి(బి), వడ్ ఝరి, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం మండల విద్యాధికారి నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మధ్యాహ్నం భోజనం వండుతున్న తీరును, పాఠశాలల పరిసరాలు, పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని అన్నారు. అదేవిధంగా పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. పాఠశాలలో వసతులు, విద్యార్థుల ఆహార మెనూ, వంట గదిని పరిశీలించారు. రోజువారి మెనూ ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు.ఆయన వెంట భోసి కాంప్లెక్స్ హెచ్ఎం. రాజశేఖర్, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యా యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాను విజయవంతం చేయాలి: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు

-ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
-రోజువారీ వేతనం రూ.600కు పెంచాలి.. 200 రోజుల పని కల్పించాల్ని

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30, తెలంగాణ పత్రిక



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం ఈ నెల 1వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంపై ఆధారపడుతున్న కూలీలు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ ఆధారిత కూలీల వేతనాలు పెంచే విధంగా పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి చట్టం చేయాలని కోరారు. అలాగే వీబీజీ రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.గ్రామీణ ప్రాంత ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, పట్టణ ప్రాంత ప్రజలకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. రోజువారీ ఉపాధి వేతనాన్ని రూ.600కు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నెల 1వ తేదీన ఉదయం 10 గంటలకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని గ్రామీణ ప్రాంత ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కోరింది.ఈ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజాల శ్రీధర్, ఉపాధ్యక్షులు మునిగే మాధురి, కుడుకుల గిరిబాబు, రైతు సంఘం అధ్యక్షులు రామంచా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి

-ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటైన విద్య అందించాలి
-ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలి
-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 30 (తెలంగాణ పత్రిక)



జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం లోకేశ్వరం మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియతో పాటు ఆయిల్ పామ్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోజువారీ ఓపీ వివరాలు, మందుల లభ్యత, మౌలిక వసతులపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన రోగులను ఉన్నత స్థాయి ఆసుపత్రులకు వెంటనే రిఫర్ చేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలు, సృజనాత్మకత, చదువుపై ఆసక్తి పెంపొందేలా వినూత్న బోధనా విధానాలు అమలు చేయాలని సూచించారు. పలువురు విద్యార్థులతో మమేకమై వారి విద్యా ప్రగతిని స్వయంగా పరిశీలించారు. అనంతరం మండల రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. మండలంలోని మొత్తం రైతుల సంఖ్య, పూర్తయిన నమోదు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి వారితో వ్యక్తిగతంగా సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక రైతు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను సందర్శించి పంట సాగు విధానం, దిగుబడి, మార్కెట్ అవకాశాలపై రైతుతో చర్చించారు. భవిష్యత్‌లో అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎగువ మానేరు ప్రాజెక్టులో తక్షణమే పూడిక తొలగించి మరమ్మతులు చేపట్టాలి: సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్

**-కుడి, ఎడమ కాలువలకు, కోతకు గురైన ఆప్రాన్‌కు మరమ్మతులు చేయాలని డిమాండ్**

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30, తెలంగాణ పత్రిక

ఎగువ మానేరు ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడిక మట్టిని తక్షణమే తొలగించి, కోతకు గురైన ఆప్రాన్‌తో పాటు కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సంస్థాన్ ఏడవ నిజాం పాలన కాలంలో 2.2 టీఎంసీల నీటి సామర్థ్యంతో సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో ఎగువ మానేరు ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు ప్రధాన జీవనాధారంగా మారిందన్నారు. ప్రధానంగా పాల్వంచ వాగు ద్వారా వచ్చే వరద నీటితో ప్రాజెక్టు నిండుతుందని, అయితే కాలక్రమేణా పర్యవేక్షణ లోపంతో 76 సంవత్సరాలుగా నీటితో పాటు చేరిన మట్టి పూడిక కారణంగా ప్రాజెక్టు సామర్థ్యం క్రమంగా తగ్గి ప్రస్తుతం 1.4 టీఎంసీలకు చేరిందని పేర్కొన్నారు. గతంలో వచ్చిన వరదల కారణంగా సుమారు 100 మీటర్ల మేర ప్రాజెక్టు లైనింగ్ ఆప్రాన్ దెబ్బతిందని తెలిపారు. అలాగే సుమారు 73 కిలోమీటర్ల మేర ఉన్న కుడి, ఎడమ కాలువలను జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలతో శుభ్రపరిచి అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని కోరారు. 3.8 కిలోమీటర్ల మేర ఉన్న ప్రాజెక్టు ఆనకట్టకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని, ప్రాజెక్టులోని 33 షటర్లకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో తొలగించే ఒండ్రు మట్టిని పరివాహక ప్రాంత రైతులకు ఉచితంగా అందించాలని సూచించారు. ఎగువ మానేరు ప్రాజెక్టుకు నీటిని విడుదల చేసి, అవసరమైన మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేష్ కోరారు. ఈ సమావేశంలో ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, అన్నల్దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




# హోటల్స్ రెస్టారెంట్లను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ ఎల్ మల్లేశం

చండూర్ తెలంగాణ పత్రిక జూన్ 30

చండూరు మున్సిపాలిటీలో ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పట్టణంలో పారిశుద్ధ్య ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలనే ఉద్దేశ్యంతో మున్సిపల్ కమిషనర్ మల్లేశం, మున్సిపల్ లోని వివిధ హోటళ్లు, రెస్టారెంట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మేనేజర్ జి. రాములు, సీనియర్ అసిస్టెంట్ ఎ. సాయిభారద్వాజ్, వార్డ్ ఆఫీసర్ బి. సాయి రాం, పర్యావరణ ఇంజనీర్ యం. అరవింద్ రెడ్డి, బిల్ కలెక్టర్లు జి. మహేష్, జి. రమేష్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొని హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, వంటశాలల నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, ఆహార నిల్వ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా కొన్ని రెస్టారెంట్లలో పరిశుభ్రత నాణ్యతా ప్రమాణాలు సరిగా పాటించడం లేదని గుర్తించారు. ఆహార భద్రత, పారిశుద్ధ్య నిబంధనలను ఉల్లంఘించిన సంబంధిత రెస్టారెంట్ యాజమాన్యాలపై మొత్తం రూ.12,000/- లు జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లేశం మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, హోటళ్లు, రెస్టారెంట్లు తప్పనిసరిగా పరిశుభ్రతను పాటిస్తూ నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే వినియోగదారులకు అందించాలని సూచించారు. వంటశాలలు, ఆహార నిల్వ గదులు, పాత్రలు, తాగునీటి సౌకర్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు ఆదేశించారు. అలాగే ప్రభుత్వం నిషేధించిన సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకుండా పర్యావరణ హిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే హోటళ్లు, రెస్టారెంట్లపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చే హోటళ్లు, రెస్టారెంట్లను మాత్రమే ప్రోత్సహించాలని, పట్టణాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.



# కొలనూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం

ఓదెల /జూన్ 29 తెలంగాణ పత్రిక

ఓదెల మండలశీ లో నీ కొలనూరు ఎస్సీ కాలనీ కమ్యూనిటీ భవనంలో మంగళవారం పౌర హక్కుల దినోత్సవం స్థానిక రెవిన్యూ ఇన్స్పెక్టర్ గౌతం ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారుఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ స్వేచ్ఛ సమానత్వం సోదరి భావం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదేవిధంగా ఎస్సీ ఎస్టీలకు రెండు గ్లాసుల పద్ధతిని నివారించడం ఎస్సీలను దేవాలయంలోనికి ప్రవేశించడం అదేవిధంగా అంటరానితనం నిర్మూలించడంతోపాటు విందులకు వినోదాల తారతమ్యాలు లేకుండా నిర్వహించుకోవడం కోసం ఇలాంటి సమావేశాలు దోహదపడతాయని అన్నారు చివరి వారం దళితవాడలో సమావేశం నిర్వహించుకోవడం జరుగుతుందని అదేవిధంగా ఎస్సీ ఎస్టి నిధులు సరియైన లబ్ధిదారులకు అందుతున్నా లేదా అనేది తెలుసుకోవడం కోసమే దళితవాడలో సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని అదేవిధంగా అందరికీ సమానత్వం కలిగించే విధంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అదేవిధంగా బాల కార్మికుల నియంత్రణ అరికట్టాలని సూచించారు ఏదైనా ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తీసుకురావాలని రెవిన్యూ ఇన్స్పెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లె కనకయ్య. పోలీసు అధికారి. జి పి ఓ సతీష్ కార్యదర్శి శంకర్ తోపాటు అంబేద్కర్ సంఘం నాయకుల సాతూరి అనిల్ కుమార్ మరియు సాతూరి రాజేశం తోపాటు భారీ ఎత్తున ప్రజలు మహిళలు హాజరయ్యారు



# పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ: నరేందర్

తానూర్:జూన్30(తెలంగాణ పత్రిక)

ఝరి(బి), వడ్ ఝరి, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం మండల విద్యాధికారి నరేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మధ్యాహ్నం భోజనం వండుతున్న తీరును, పాఠశాలల పరిసరాలు, పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని అన్నారు. అదేవిధంగా పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. పాఠశాలలో వసతులు, విద్యార్థుల ఆహార మెనూ, వంట గదిని పరిశీలించారు. రోజువారి మెనూ ను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట భోసి కాంప్లెక్స్ హెచ్ఎం. రాజశేఖర్, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏరియాలో ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగుల క్వార్టర్స్ కేటాయింపునకు కౌన్సిలింగ్ నిర్వహణ

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక జూన్ 30

మంగళవారం న, సింగరేణి కొత్తగూడెం ఏరియాకు చెందిన ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగుల క్వార్టర్స్ కేటాయింపు సంబంధిత కౌన్సిలింగ్ కార్యక్రమం మంగళవారం రుద్రంపూర్ లోని ఆర్ సి ఓ ఏ క్లబ్‌లో సీనియారిటీ ప్రామాణికంగా నిర్వహించబడింది. ఈ కౌన్సిలింగ్ లో ఎన్ సి,ఎం సి, ఎంహెచ్, సీ2 టీ2 జ2 ,ం2, ఎండి క్వాటర్స్ కేటాయింపు సంబందిత కౌన్సిలింగ్ ప్రక్రియ మొత్తం యజమాన్యం , కమిటీ సభ్యులు యూనియన్ ప్రతినిధులు సంబంధిత అధికారుల సమక్షంలో నిర్వహించబడింది. క్వార్టర్స్ కేటాయింపుకు సంబంధించిన విధానాలు, అర్హతలు, ప్రాధాన్యత క్రమం తదితర అంశాలపై అధికారులచే ఉద్యోగులకు వివరించబడింది. మొత్తం 82 మంది కొత్తగూడెం ఏరియాకు చెందిన ఉద్యోగులు కౌన్సిలింగ్ నమోదు చేసుకున్నారు. ఇందులో 23 మంది క్వార్టర్స్‌ను ఎంపిక చేసుకున్నారు , 40 మంది గైర్హాజరు కాగా, 19 మంది ఆసక్తి చూపలేదు..ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఎం. గోవిందరావు పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి డీజీఎం (ఈఅఎం) క్రిస్టోఫర్ ఇన్‌చార్జ్ హెచ్ ఓ డి (సివిల్) కె. రాజారాం డివైపిఎం జి. హరీష్ ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రెటరీ గట్టయ్య వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్ ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలి

**-వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అందే బీరన్న, అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్**



గ్రేటర్ హైదరాబాద్ / జూన్ 30,( తెలంగాణ పత్రిక )

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వార్డు సభ్యుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వార్డు సభ్యుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు రాష్ట్ర అధ్యక్షులు అందే బీరన్న ,అతికం రాజశేఖర్ గౌడ్ హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఇతర రాష్ట్రాలలో అవలంబించిన విధంగా గౌరవ వేతనం ఇవ్వాలని, వార్డు సభ్యులకు తెలంగాణ రాష్ట్రంలో గౌరవ వేతనం 3000 వేలు ఇవ్వాలని ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్సు 25 లక్షలు చనిపోయిన వార్డు సభ్యులకు నష్టపరిహారం 20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో వార్డు సభ్యులు గ్రామాల అభివృద్ధికి నిరంతరం ఎంతో గాను కృషి చేస్తున్నారని ఈ విషయాన్ని గుర్తించి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుముల నవీన్ కుమార్ , రాష్ట్ర కార్యదర్శి సందగిరి వెంకటేష్, ధూపం ఆంజనేయులు, రాష్ట్రాధికార ప్రతినిధి నాగుల సాంబయ్య గౌడ్ , కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మూల కరుణాకర్ గౌడ్,రాష్ట్ర నాయకులు గంగధర గంగజమున వెంకటరమణ, కామెర తిరుమల , ,తదితరులు పాల్గొన్నారు.

# చండూరు హై స్కూల్ జూనియర్ అసిస్టెంట్ రేణుకకు వీడ్కోలు



చండూర్ తెలంగాణ పత్రిక జూన్ 30

బదిలీపై నల్లగొండ జిల్లా పరిషత్ కు వెళ్లిన చండూరు ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేసిన ఉప్పునూతల రేణుకకు పాఠశాల సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. గత పది సంవత్సరాలు గా ఈ పాఠశాలలో పనిచేసిన రేణుక ను శాలువాతో సత్కరించి, మెమెంటోను అందజేశారు. నూతనంగా విచ్చేసిన జూనియర్ అసిస్టెంట్ రాజు, ఆఫీస్ సబార్డినేట్ శ్రీను లకు స్వాగతం పలికారు. ప్రధానోపాధ్యాయులు ఏ. కోటీశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని విద్యార్థులు జూనియర్ అసిస్టెంట్ గా రేణుక పాఠశాలకు అందించినసేవలను కొనియాడుతూ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు.

# కర్ర చలపతి రెడ్డి పార్థివ దేహానికి నివాళి... ఎమ్మెల్యే బిఎల్ఆర్



మాడ్గులపల్లి//నల్గొండ//జూన్ 30:(తెలంగాణ పత్రిక):-

మాడ్గులపల్లి మండలం గండ్రవాణి గూడెం గ్రామానికి చెందిన కర్ర చలపతి రెడ్డి స్వర్గస్తులయ్యారు అనే విషయన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకొన్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి వారి స్వగ్రామానికి వెళ్లి వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మనోధైర్యాన్ని కల్పించారు అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను దెబ్బతీసే 'పీఎం శ్రీ' ని వ్యతిరేకించండి: సిఐటియు నేత అర్జున్



తెలంగాణ పత్రిక దమ్మపేట జూన్ 30

దమ్మపేట: అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రజలకు అందుతున్న పలు రకాల సేవలను దూరం చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 'పీఎం శ్రీ' పథకాన్ని తీసుకువచ్చిందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ విమర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేయడమే మోడీ ప్రభుత్వ లక్ష్యమని, ఈ చర్యలను ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మంగళవారం మండల వ్యాప్తంగా నిర్వహించిన అంగన్‌వాడీ సర్కిల్ మీటింగ్లలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ... గత అనేక సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా టీచర్లు, హెల్పర్లు చేసిన కృషి ఫలితంగానే దేశంలో పోషకాహార లోపం తగ్గిందని, అక్షరాస్యత పెరిగిందని గుర్తుచేశారు. రక్తహీనత, పోలియో నిర్మూలనతో పాటు మానవ అభివృద్ధి సూచీలో మన దేశాన్ని ముందుంచడంలో అంగన్‌వాడీల పాత్రను పలు అంతర్జాతీయ సంస్థలు సైతం ప్రశంసించాయని అన్నారు. కానీ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్ బడ్జెట్‌లో కోత పెట్టి, ఆ నిధులను పీఎం శ్రీ పథకానికి దారి మళ్లించిందని ఆరోపించారు. ఈ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ పాఠశాలలు ఊరికి దూరంగా ఉండటం, ఇతర సాంకేతిక కారణాల వల్ల ప్రజలు తమ పిల్లలను ఆ పాఠశాలలకు పంపడం లేదని స్పష్టం చేశారు.

**ప్రధాన డిమాండ్:**

'పీఎం శ్రీ' బాధ్యతలను అంగన్‌వాడీ కేంద్రాలకే అప్పగించాలి. అంగన్‌వాడీ వ్యవస్థను బలహీనపరిచే ఈ పథకాన్ని రద్దు చేసేంతవరకు అంగన్‌వాడీ ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాలి. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు, సూరమ్మ, జ్యోతి, కృప, శాంతి, కృష్ణవేణి, భద్రమ్మ, శ్రీదేవి, ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో రైతు భరోసా ప్రారంభం

-48 వేల మంది రైతులకు రూ.92.77 కోట్ల సాయం



తెలంగాణ పత్రిక దమ్మపేట జూన్ 30

రాష్ట్రంలో వానాకాలం రైతు భరోసా పథకం ప్రారంభమైంది. మంగళవారం హైదరాబాద్ నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంచనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్వారిగూడెం రైతు వేదికలో ఏర్పాటు చేసిన లైవ్ స్ట్రీమింగ్ కార్యక్రమానికి అశ్వారావుపేట శాసనసభ్యుడు జారే ఆదినారాయణ హాజరయ్యారు.

**ముఖ్యమైన వివరాలు:**

లబ్ధిదారుల సంఖ్య: అశ్వారావుపేట నియోజకవర్గంలో మొత్తం 48,838 మంది రైతులకు ఈ పథకం వర్తిస్తుంది. మొత్తం నిధులు: రూ. 92,77,50,912 (92 కోట్ల 77 లక్షల 50 వేల 912 రూపాయలు) విడతల వారీగా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. ఎమ్మెల్యే పిలుపు: రైతులు ఈ మొత్తాన్ని దుర్వినియోగం చేయకుండా, తమ పంట పెట్టుబడికి వాడుకుని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని శాసనసభ్యుడు కోరారు.

**హాజరైన ప్రముఖులు:**

రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులతో పాటు ఏడీఏ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఓ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలు పాటించని ఆహార పదార్థాల తయారీదారులపై కఠినంగా వ్యవహరించాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా ప్రతినిధి జూన్ 30 (తెలంగాణ పత్రిక)



జిల్లాలోని ఆహార పదార్థాలు దుకాణదారులంతా ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆహార భద్రతపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, దాబాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని అన్నారు. వంటల తయారీలో ఉపయోగించే నూనెలు, మసాలా దినుసులు, పాలు, పెరుగు తదితర ముడి పదార్థాలు నాణ్యమైనవే వినియోగించాలని అన్నారు. ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, దుకాణాల లైసెన్సులు సరి చూడాలని పేర్కొన్నారు. ముడి పదార్థాల గడువు తేదీలను, లేబుళ్లను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించినా, ఫుడ్ కలర్లను వాడినా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, పాలు, పాల పదార్థాలు, మాంసం వంటి ఆహార పదార్థాలు తాజావే వాడుతున్నారో లేదో చూడాలని చెప్పారు. అపరిశుభ్రమైన, గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించినా, దుకాణాల్లో నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం, ఇటీవలి ఫుడ్ సేఫ్టీ అంశం మీద శిక్షణ పొందిన పలువురు అంగన్వాడి టీచర్లకు కలెక్టర్, అధికారులు సర్టిఫికెట్లను అందించారు. ఈ సమావేశంలో జిల్లా ఆహార భద్రత అధికారి సునీత, వైద్యారోగ్య అధికారి రాజేందర్, డిడబ్ల్యూవో వినూత్న, డిపివో శ్రీనివాస్, డిఈఓ భోజన్న, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బక్కలవాడ ప్రభుత్వ పాఠశాలలోని సౌకర్యాలపై అరా

-విద్యార్థులతో కలిసి భోజనం చేసిన... మాజీ ఎమ్మెల్యే జూలకంటి

-ప్రభుత్వ పాఠశాలలను ఇంటిగ్రేటెడ్ పాఠశాలలుగా మార్చాలి. జూలకంటి డిమాండ్

మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 30:(తెలంగాణ పత్రిక):-



మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల, అందులో పని చేస్తున్న వంట పని వారి కష్టాల అధ్యాపకుల గురించి సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మంగళవారం నాడు స్థానిక బక్కలవాడ ఉన్నత పాఠశాలను సందర్శించి వివరాలను దగ్గర నుండి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు కలిసి భోజనం చేయడం జరిగింది. విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండి పెట్టే వారి గురించి వివరాలను అడిగారు. వారు తమ కలిగే సమస్యలను గురించి వివరించారు. తమకు విద్యార్థి ఒక్కరికి రోజుకు వంద రూపాయలు చొప్పున ఇస్తున్నారని వంటచేరుకులు గ్యాస్ ఇవ్వటం లేదని తెలిపారు. తామే పంటకు అయ్యే ఖర్చులను భరించాల్సి వస్తుందని అట్టి బిల్స్ కూడా రోజుల తరబడి వేసి ఉండాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎక్కువ శాతం పేద వర్గాల కు చెందిన వారే ఉన్నారని అట్టివారి కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలగా మార్చాలని దాని ద్వారా విద్యార్థులకు సమగ్రమైన విద్యార్థిని వారు తెలిపారు. మధ్యాహ్నం భోజనం వడ్డించే వంట చేసేవారికి ప్రభుత్వం తక్కువ ఖర్చులుతుందని వారందరికీ విద్యార్థికి ఒక్కంటికి 15రూపాయలు ఇస్తే కొంతలో కొంతైనా నష్టాన్ని పుడుచుకుంటారని వారు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు అధికంగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయుల సంఖ్య అందుకు అనుకూలంగా లేదని ఉపాధ్యాయ నియామకాలు జరగాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను నియోజకవర్గానికి ఒకటే కాకుండా ప్రతి మండలానికి మూడు పాఠశాల ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యా అందించాలని కోరారు. పాఠశాలలో మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని విద్యార్థులు మధ్యాహ్న సమయంలో పాఠశాల ఆవరణలో కాకుండా డైనింగ్ హాల్ నిర్మాణం చేయాలని కోరారు. పాఠశాలను సందర్శించిన వారిలో సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు, రవి నాయక్, మల్లు గౌతమ్ రెడ్డి, బావుండ్ల పాండు, తిరుపతి, రామ్మూర్తి, పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు ఆయన వెంట ఉన్నారు.

# టీజీ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గంధపు రాజు నియామకం

కోటగిరి తెలంగాణ పత్రిక జూన్ 30.



తెలంగాణ బిసి సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడుగా పోతంగల్ మండల కేంద్రానికి చెందిన గంధపు రాజుకు హైదరాబాద్ లోని హిమాయత్ నగర్ బిసి భవన్ లో రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, అఖిల భారత యాదవ కార్యదర్శి తోకల రామకృష్ణ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నియామక పత్రం అందుకున్న అనంతరం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు గంధపు రాజు మాట్లాడుతూ ... రాష్ట్ర అధ్యక్షులు అగు మేకపోతుల నరేందర్ గౌడ్, అఖిల భారత యాదవ కార్యదర్శి తోకల రామకృష్ణ యాదవ్ కు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి మూర్తి, రాష్ట్ర కార్యదర్శి అన్నగౌడ్ నారగౌడ్ గార్లకు కృతజ్ఞతలు తెలుపుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని బిసి సంక్షేమ సంఘాలకు బలోపేతానికి కృషి చేస్తూ, బిసి సంఘాలకు నాయకులకు యువకులకు చైతన్యం పరుస్తూ, అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు.



తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం
TELANGANA B.C. SANKSHEMA SANGAM
Mekapothula Narender Goud
State President

Date: 22/06/2026

APPOINTMENT ORDER

Dear Gandhapu Raju Garu

I am happy to inform that you have been appointed as President for Nizamabad District., of Telangana, for Telangana State B.C. Sankshema Sangham with immediate effect

On this occasion, I congratulate and wish that you will extend your service to strengthen the Telangana State B.C. Sankshema Sangham.

With good wishes,

Mekapothula Narender Goud
State President
Telangana B.C. Sankshema Sangam

# అంగన్వాడీ కేంద్రానికి కుర్చీలు, స్టడీ మెటీరియల్ అందజేసిన షాబొద్దీన్

-యువచైతన్య దీపం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30, తెలంగాణ పత్రిక





రాజన్న సిరిసిల్ల జిల్లాకోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో యువచైతన్య దీపం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎండీ షాబొద్దీన్ ఫౌండేషన్ ద్వారా అంగన్వాడీ చిన్నారులకు 4 కుర్చీలు, అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిన్నా అనిల్, గ్రామ పెద్దలు, యువచైతన్య దీపం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శేఖర్ సేనాపతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేఖర్ సేనాపతి మాట్లాడుతూ.. పల్లిమక్త గ్రామానికి చెందిన షాబొద్దీన్ తన గ్రామంలోని చిన్నారుల కోసం సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు, ఇతర అవసరాల కోసం చిన్న చిన్న సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు యువత, ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామాల కనీస అవసరాలను తీర్చడమే కాకుండా, మరికొందరికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. గ్రామాల ఐక్యతను చాటుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు యువత చైతన్యవంతమైన పాత్ర పోషించాలని సూచించారు. పల్లిమక్త గ్రామంలో షాబొద్దీన్ చేసిన సేవా కార్యక్రమం ఎంతో మందికి ఆదర్శంగా, మార్గదర్శిగా నిలుస్తుందని శేఖర్ సేనాపతి కొనియాడారు.

# పెద్దాపూర్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

-9 మంది అరెస్ట్, ఒకరు పరారీ

ఆత్మకూర్ :జూన్ 30 ,(తెలంగాణ పత్రిక):

ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో పేకాట నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించినట్లు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ పి. తిరుపతి ఆధ్వర్యంలో జూన్ 29న నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో, లోనే హేమంత్ కుమార్ ఇంట్లో డబ్బులు పెట్టి మూడు ముక్కలాట (పేకాట) ఆడుతున్న వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. తొలుత ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న వారి కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టగా, అనంతరం మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వారి వద్ద నుంచి రూ.600 నగదును స్వాధీనం చేసుకోగా, మొత్తం 9 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.4,040 నగదు, 52 ప్లేయింగ్ కార్డులు, 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ సంతోష్ కుమార్ వెల్లడించారు. ఈ కేసులో మరో నిందితుడు అన్నం నాగరాజు, పెద్దాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి, ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయని తెలిపారు. అక్రమ జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సీఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు. ఈ కేసుకు సంబంధించిన తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

## జిల్లాలో యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందవద్దు: కలెక్టర్ గరిమ అగ్రవాల్

**-ఫెర్టిలైజర్ యాప్ ద్వారా 50 వేలకు పైగా యూరియా సంచుల కొనుగోలు**

**-యాప్‌ను అప్డేట్ చేసుకుని బుకింగ్ చేసుకోవాలని సూచన**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30, తెలంగాణ పత్రిక**

జిల్లాలో యూరియా కొరత లేదని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఫెర్టిలైజర్ యాప్, ఎరువుల సరఫరా, నిల్వలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వ్యవసాయ శాఖ, ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఫెర్టిలైజర్ యాప్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 19,513 మంది రైతులు యాప్ ద్వారా 60,254 యూరియా సంచులను బుక్ చేసుకున్నారని, అందులో 50,283 సంచులను రైతులు తమ సమీప దుకాణాల నుంచి తీసుకెళ్లారని వెల్లడించారు. ఇంకా 9,830 సంచులు రైతులు తీసుకెళ్లాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 12,292 యూరియా సంచులు నిల్వ ఉన్నాయని కలెక్టర్ వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని 20 రైతు వేదికలు, అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ప్రైవేట్ ఎరువుల డీలర్ల వద్ద ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులకు సహాయం అందించేందుకు రైతు వేదికలు, పీఏసీఎస్‌లు, ప్రైవేట్ డీలర్ల వద్ద సహాయకులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



రైతులు ఫెర్టిలైజర్ యాప్‌ను తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని సూచించారు. యాప్‌లో యూరియా నిల్వలు కనిపించకపోతే ఆందోళన చెందకుండా రిఫ్రెష్ చేయాలని తెలిపారు. యూరియా సరఫరాలో ఎలాంటి సమస్యలు ఎదురైనా సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువులను వినియోగించాలని కోరారు. కొన్ని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని కలెక్టర్ సూచించారు. పంటల సాగుకు అనుగుణంగా అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ సీజన్‌కు సరిపడా ఎరువుల నిల్వలను సిద్ధంగా ఉంచాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు సహాయం చేస్తూ మనసున్న మహారాజు అనిపించుకుంటున్న రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్‌లి

**ఆమనగల్లు మే 9 తెలంగాణ పత్రిక**

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం హనుమాన్ పల్లి గ్రామ పంచాయతీకి చెందిన పోతుగంటి సావిత్రి జంగయ్య దంపతుల కూతురు మానస పెండ్లికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కడ్తాల్ మాజీ జెడ్పిటిసి రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్. రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరుపేద ఆడబిడ్డ మానస దంపతులను నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించి పెళ్లికి ఒక పట్టుచీర 21000 రూపాయలను ఇవ్వడంజరిగింది. పోతుగంటి సావిత్రి జంగయ్య దంపతులకు ఏ సహాయ సహకారాలు కావాలన్నా చేయడానికి రాధాకృష్ణ మెమోరియల్





చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పోతుగంటి సావిత్రి జంగయ్య దంపతుల కూతురు మానస పెళ్లికి కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ 10000 రూపాయల ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా సహాయం పొందిన పోతుగంటి సావిత్రి జంగయ్య దంపతులు మాట్లాడుతూ నిరుపేద ఆడబిడ్డల పెళ్ళిళ్లకు ఒక పెద్దన్నల సహాయం చేస్తున్న కడ్తాల్ మాజీ జడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ఒక మనసున్న మహారాజు అని అలాగే కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శీను నాయక్ వార్డు సభ్యులు దేవా నాయక్ ప్రశాంత్ పద్మరాజు గౌడ్ చాంది లక్ష్మణ్ నాయకులు కుమార్ గౌడ్ ప్రేమ్ రమేష్ శేఖర్ టిక్ లాల్ మహేష్ జంగయ్య మైసయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోటు బుక్స్ యూనిఫామ్స్ అందివ్వాలని ఆర్డిఓ ఆఫీస్ ముందు నిరసన

**-సంక్షేమ వసతి గృహ విద్యార్థుల పై ముఖ్యమంత్రి సవతి తల్లి ప్రేమ**

**-ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫామ్స్ అందించాలి.**

**-ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్**

**మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 30:(తెలంగాణ పత్రిక):-**

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు తాటికమ్మలపై అక్షరాలు రాస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ ,బీసీ సంక్షేమ వసతి గృహ లలో ఉండే పేద మధ్య తరగతి విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభమై 15రోజులు గడుస్తున్న ఇప్పటివరకు నోట్ పుస్తకాలు అందించకపోవడం చాలా బాధాకరం రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమ వసతి గృహ విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగోండ జిల్లా వ్యాప్తంగా 30గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో 5600మంది గిరిజన విద్యార్థులు 45ఎస్సీ వసతి గృహ ల్లో సుమారు 3500మంది దళిత విద్యార్థులు బిసి 25వసతి గృహాల్లో సుమారు 3800మంది వెనుకబడిన తరగతుల విద్యార్థులు వసతి పోందుతున్నారని వీరికి ఇప్పటి వరకు బట్టలకు మరియు నోట్ పుస్తకాలకు ఎలాంటి టెండర్లు పిలవకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని




ఆందోళన వ్యక్తం చేశారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు పాఠాలు చెపుతుంటే విద్యార్థులు నోటు పుస్తకాలు అందక అనేక ఇబ్బందులు పడుతూ తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొచ్చి డబ్బులు పెట్టి నోటు పుస్తకాలు కొనుకుంటున్న పరిస్థితి నల్లగొండ జిల్లాలో తెలంగాణ రాష్ట్రంలో దాప్రించిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందుకే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు రెండు జతల యూనిఫామ్స్ , సాక్స్ షూ బెడ్ షీట్ తొమ్మిది రకాల వస్తువులతో రేవంత్ రెడ్డి కిట్టులు ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలు కోటలో దాటుతున్నాయి ఆచరణ గడప దాటడం లేదని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఎస్సీ ఎస్టీ బీసీ సంక్షేమ శాఖ మంత్రులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్షణమే నోటు పుస్తకాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పూనుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు మూడవత్ జగన్ నాయక్, పుట్ట సంపత్, బన్నీ, అజయ్, కల్పన, రాధిక, కళ్యాణి, స్పందన, శీరీష, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

# సమర్థ దర్యాప్తు చేసిన ఇన్స్పెక్టర్ సంతోష్

**-నిందితులకు హత్య కేసుల్లో జీవిత ఖైదు శిక్షలు**

**-సీఐ సంతోష్ కు పోలీస్ కమిషనర్ ప్రశంసలు, రివార్డు**

**ఆత్మకూర్, జూన్ 30 (తెలంగాణ పత్రిక):**

గతంలో దర్యాప్తు చేసిన రెండు హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు శిక్షలు పడేలా సమర్థవంతంగా విచారణ పూర్తి చేసినందుకు పోలీసు కమిషనర్ నుంచి ప్రశంసలు, నగదు రివార్డు అందుకున్నట్లు ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ సీఐ ఆర్. సంతోష్ తెలిపారు. 2015లో వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో రాయపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊకల్ గ్రామంలో జరిగిన హత్య కేసును వెంటనే స్వీకరించి, నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచడంతో పాటు ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. అనంతరం విచారణ పూర్తిచేసిన న్యాయస్థానం నిందితుడికి జీవిత ఖైదు విధించిందన్నారు. అలాగే, 2018లో నర్మెట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో నర్మెట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లంద గ్రామంలో జరిగిన మరో హత్య కేసును వేగంగా దర్యాప్తు చేసి, నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో విచారణ అనంతరం 2026లో న్యాయస్థానం నిందితులకు జీవిత ఖైదు విధించిందని పేర్కొన్నారు.




ఈ రెండు హత్య కేసుల్లో సమర్థవంతమైన దర్యాప్తు, నిరంతర పర్యవేక్షణతో నిందితులకు శిక్షలు పడేలా చేసిన సేవలను గుర్తించిన పోలీస్ కమిషనర్ తనను అభినందించి రివార్డుతో సత్కరించినట్లు సీఐ ఆర్. సంతోష్ తెలిపారు.

## సర్ ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొన్న మహేష్ యాదవ్



**తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం జూన్ 30.**

హఫీజ్‌పేట్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇంటింటి సర్వే ఈరోజు హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలో బూత్ నంబర్స్ 211, 212 పరిధిలో ఎస్ఐఆర్ (సర్ ) ప్రక్రియపై ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, బీఎల్ఏలు, బీఎల్వోలు, స్థానిక బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్ , కోటేశ్వర్ రావు, రవి గౌడ్ తో కలిసి బిజెపి రాష్ట్ర నాయకులు మహేష్ యాదవ్ సర్వే కార్యక్రమాన్ని సందర్శించి, ఎస్ఐఆర్ ప్రక్రియ క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతోందో పరిశీలించారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హులైన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా సూచనలు చేయడం జరిగింది. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించి, తమ వివరాలను సరైన విధంగా అందించాలని కోరారు.

## ఏడుపాయల పర్యాటకానికి చేయూత

**-శీమెదక్ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం ..**

**పాపన్నపేట, జూన్ 30:(తెలంగాణ పత్రిక)**

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయ పర్యాటకాభివృద్ధి కొరకు ఏకో ఫ్రెండ్లీ 12 కాటేజీల నిర్మాణానికి రూ. 7 కోట్లు మైనంపల్లి రోహిత్ రావు చోరవతో.. టూరిజం శాఖ టిజి టిడిసి ద్వారా సోమవారం మంజూరు చేయడం జరిగింది. మంగళవారం పాపన్నపేట మండల సర్పంచులు,కాంగ్రెస్ నాయకులు,మాజీ సర్పంచులు కార్యకర్తలు ఏడుపాయల వనదుర్గ భవాని మాత ఆలయం వద్ద మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ ప్రాంత అభివృద్ధి కొరకు కృషి చేసిన ఎమ్మెల్యే కు వారు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాపన్నపేట మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్..నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్, సర్పంచులు..విజయదుర్గా నాని, సుశీల దుర్గన్న, శ్రీధర్, నాగరాజు, సిద్దప్ప, శ్రీశైలంఅప్ప, హీరాలాల్, శీను, అంజనేయులు, రాజశేఖర్, ప్రభాకర్, మల్లప్ప, రమేష్, భూమన్న వెంకటేశ్వర రెడ్డి, ఖలీమ్, సంగమేష్, ప్రవీణ్ శివన్న తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ పంపిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన మహిళ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

**-ఎల్లారెడ్డిపేట పోలీసుల చర్యలు.. పరారీలో నిందితురాలి కుమారుడ్ను**

**సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30, తెలంగాణ పత్రిక**



గల్ఫ్ దేశానికి పంపించి మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు తీసుకొని మోసం చేసిన కేసులో హరిదాస్ నగర్ గ్రామానికి చెందిన గున్నాల మమతను ఎల్లారెడ్డిపేట పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, గౌరవ మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఈ కేసులో ఆమె కుమారుడు గున్నాల శ్రీకాంత్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. హరిదాస్ నగర్ గ్రామానికి చెందిన గున్నాల మమత, భర్త ఆంజనేయులు, వయస్సు 55 సంవత్సరాలు, తన కుమారుడు గున్నాల శ్రీకాంత్ గల్ఫ్ దేశంలో ఓ కంపెనీలో పనిచేస్తున్నాడని, అతనికి ఏజెంట్ లైసెన్స్ ఉందని అమాయక ప్రజలను నమ్మించేది. గల్ఫ్ దేశాలకు పంపించి మంచి కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి, వారిని విజిట్ వీసాలపై పంపించి ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేసి అధిక మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై గతంలో కూడా కొనరావుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు వెల్లడించారు.

తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గుండ్ల రాజు తన కుమారుడు గుండ్ల నవీన్‌ను గల్ఫ్‌కు పంపిస్తానని నమ్మి రూ. 1,70,000 తీసుకున్నారని ఫిర్యాదు చేశాడు. అనంతరం నవీన్‌ను విజిట్ వీసాపై దుబాయ్ పంపించగా, అక్కడ ఉన్న గున్నాల శ్రీకాంత్ అతనికి కంపెనీలో ఉద్యోగం ఇప్పించకుండా సాధారణ పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురిచేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కంపెనీ వీసా ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని విజిట్ వీసాపై పంపించారని ప్రశ్నించగా, డబ్బుల గురించి అడిగితే దుర్భాషలాడినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట ఎస్సై కే. రాహుల్ రెడ్డి గున్నాల మమత, ఆమె కుమారుడు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం గున్నాల మమతను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఈ కేసులో గున్నాల శ్రీకాంత్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

## జిల్లాలో 20వేల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ను పరిశీలించిన అధికారులు



మిర్యాలగూడ ప్రతినిధి//జూన్ 30:(తెలంగాణ పత్రిక):-

నల్గొండ జిల్లాలో 20వేల మెట్రిక్ టన్నుల యూరియా ఆఫర్ స్టాక్ ఉందని జిల్లా వ్యవసాయ అధికారి వల్లోజు వినోద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి వల్లోజు వినోద్ కుమార్ మిర్యాలగూడ వ్యవసాయ సంచాలకులు జగదీశ్వర్ రెడ్డి వ్యవసాయ అధికారి ఉరుష్చంద్ర మని రుషేంద్రమణి తో కలిసి మిర్యాలగూడ లోని యూరియా రేట్ పాయింట్ మరియు మార్కెఫెడ్ ఒఫర్ స్టాక్ గోదామును సందర్శించి యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 20వేల మెట్రిక్ టన్నుల యూరియా నిలువ అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. జిల్లాలో రైతుల అవగాహన అవసరాలకు అనుగుణంగా యూరియా ఎరువులు తగినంత నిలువ ఉందని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. యూరియా యాప్ గురించి రైతులతో చర్చించారు. అలాగే వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా నిరంతరం కొనసాగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి వల్లోజు వినోద్ కుమార్ సూచించారు.

## రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవ సందర్భంగా బోనాలు

-నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి
-నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి




వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 30 (తెలంగాణ పత్రిక):



వెల్దుర్తి మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ 11వ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం అమ్మవారికి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి హాజరయ్యారు. శివసతుల విన్యాసాలు పోతురాజుల కొరడా విన్యాసాలు డీజే డప్పు సప్పుల వాయిద్యాల మధ్య ఘనంగా అమ్మవారికి బోనాలు నిర్వహించారు. అంతకు ముందు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సునిత లక్ష్మరెడ్డి ఆవుల రాజిరెడ్డికి ఘన స్వాగతం పలికి చాలులతో సన్మానించారు. అనంతరం అమ్మవారి సన్నిధికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రేణుక ఎల్లమ్మ కరుణాకటాక్షం వలన వెల్దుర్తి మండల ప్రజలు సుఖశాంతులతో అష్టైశ్వర్యాలతో ఇంటిల్లిపాదలతో సుఖమైన జీవితం గడపాలని అమ్మవారి కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటల తో కళకళలాడాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు.

## మాచారెడ్డి సింగిల్ విండోలో యూరియా మాయం

కామారెడ్డి ,జూన్ 30,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



యూరియా అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రభుత్వం ఫర్టిలైజర్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తుండగా, కామారెడ్డి జిల్లా మాచారెడ్డి సింగిల్ విండోలో యూరియా పంపిణీలో గందరగోళం చోటుచేసుకుంది. రైతులు యూరియా తీసుకోకపోయినా, యాప్‌లో మాత్రం తీసుకున్నట్లు నమోదు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న రైతులు సింగిల్ విండో కార్యాలయానికి చేరుకుని సిబ్బందిని నిలదీశారు. ఇది యాప్‌లో సాంకేతిక లోపమా, లేక అధికారుల నిర్లక్ష్యమా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై వ్యవసాయ శాఖ అధికారులను వివరణ కోరగా, యాప్‌లో ఎలాంటి సాంకేతిక లోపం లేదని, సింగిల్ విండో సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని తెలిపారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా కోఆపరేటివ్ అధికారి రామ్మోహన్ మంగళవారం మాచారెడ్డి సింగిల్ విండో కార్యాలయంలో విచారణ చేపట్టారు. సిబ్బంది ఇచ్చిన సమాధానాలతో అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ఘటన ఎక్కడా జరగలేదని వ్యాఖ్యానించారు. సుమారు 103 యూరియా బస్తాల గల్లంతు అంశంపై సిబ్బంది స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫర్టిలైజర్ యాప్ ద్వారా పారదర్శకంగా యూరియా పంపిణీ జరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, మాచారెడ్డి ఘటనలో అసలు తప్పిదం ఎక్కడ జరిగిందన్నది ఇంకా స్పష్టతకు రాలేదు. సిబ్బందికి యాప్ గురించి అవగాహన లేదని స్పష్టమవుతుందని రైతులు ఆ గ్రహం వ్యక్తం చేశారు.

# కళాజాతతో పల్స్ పోలియోపై అవగాహన

-ఘణపురంలో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
-పల్స్ పోలియో, బడి బాట, ప్రజాపాలన, డ్రగ్స్
-గంజాయి నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం

నంగునూరు, జూన్ 30(తెలంగాణ పత్రిక):

తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాంజలి రాజేశ్ బృందం మంగళవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఘణపురం గ్రామంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించింది. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా కలెక్టర్, సమాచార, పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకుడి ఆదేశాల మేరకు ఈ కళాజాత కార్యక్రమం నిర్వహించినట్లు కళాంజలి రాజేశ్ తెలిపారు. ఈ సందర్భంగా పల్స్ పోలియో చుక్కల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. బడి బాట,



ప్రజాపాలన అంశాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలన వంటి సామాజిక అంశాలపై పాటలు, నాటికలు, సందేశాత్మక ప్రదర్శనల ద్వారా చైతన్యం కల్పించారు. చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కళాకారులు పిలుపుని చ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి ఘనపురం సాయిలు హాజరై మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కళాజాత ద్వారా ప్రభుత్వ సంక్షేమ, ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు వీక్షించి కళాకారుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాంజలి రాజేశ్ (టీమ్ లీడర్), దీకొండ భాస్కర్, ముదిగొండ నర్సింలు, పుల్లూరు యాదగిరి, వీరబత్తిని వెంకటేశ్(వి.వి.కన్న), మోతే బాబు, సడిమెల రాజమణి, బండ మంజుల, ఎల్లగారి శేఖర్, ఏర్పుల నర్సయ్య పాల్గొన్నారు.

# దేవాలయాలు ఐక్యతను బలోపేతం చేస్తాయి

-మాధవనేని రఘునందన రావు, మెదక్ పార్లమెంట్ సభ్యుడు
-భక్తాంజనేయ స్వామి కళ్యాణ మండపానికి నిధులు మంజూరు చేస్తాం
-భక్తాంజనేయుని సన్నిధిలో ఎంపీ రఘునందన్ రావు
-పునః ప్రతిష్ఠ మహోత్సవంలో ప్రత్యేక పూజలు
-వేదాశీర్వచనం.. ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు

నంగునూరు, జూన్ 30(తెలంగాణ పత్రిక);





ఆంజనేయ స్వామి భక్తి, బలం, ధర్మానికి ప్రతీక. పవిత్ర క్షేత్రాల్లో జరిగే పునః ప్రతిష్ఠ మహోత్సవాలు ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయి. గ్రామాల్లో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయి. భక్తాంజనేయుని అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు వెల్లివిరియాలి" అని మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయం భక్తజన సందోహంతో కళకళలాడింది. పునః ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు ఆలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి భావాన్ని చాటుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీకి గ్రామ పురోహితుడు ఆదిరాల సాయినాథ శర్మ, ప్రముఖ వేద పండితుడు జనమంచి సీతారామ శర్మ, ఆలయ పూజారి రామాచారితో పాటు ఆలయ కమిటీ ఛైర్మన్ మెతుకు హనుమంత రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. వేద ఘోషలు, మంగళ వాయిద్యాల నడుమ ఎంపీ ఆలయంలోకి ప్రవేశించారు, వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, "దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు కేంద్ర బిందువులు. వాటి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలి. ధర్మ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం" అని పేర్కొన్నారు. భక్తాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణాన్ని చేపట్టి పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. భక్తాంజనేయ స్వామి కళ్యాణ మండప నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి డబ్బులు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఈ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన హోమాలు, పూర్ణాహుతి, వేద పారాయణం, తీర్థ ప్రసాదాల పంపిణీ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నంగునూరు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తాంజనేయ స్వామి పునః ప్రతిష్ఠ మహోత్సవంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల సుఖ శాంతులు, రాష్ట్రాభివృద్ధి కోసం ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వల్లపురెడ్డి రజనీకర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల తిరుపతిరెడ్డి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు చౌడుచర్ల వెంకటరామిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా మండల శాఖ అధ్యక్షుడు జీడిపల్లి రజనీకర్ రెడ్డి, బీజేపీ నేతలు గంధం పరమేశ్వర్ రెడ్డి, బూరుగు శ్రీనివాస్, పప్పు సురేందర్ రెడ్డి, అమిరిశెట్టి ప్రవీణ్ కుమార్, పెద్ది లవ కుమార్ రెడ్డి, కోల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధల మధ్య శ్రీ రేణుకా ఎల్లమ్మకు ఘనంగా బోనాల సమర్పణ







-సంప్రదాయాలకు అద్దం పట్టిన బోనాల ఉత్సవాలు
-భక్తులతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
-పోతరాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలతో బోనాల వైభవం
-భక్తుల కోలాహలంతో వైభవంగా ముగిసిన మూడో రోజు ఉత్సవాలు

వెల్దుర్తిమండల ప్రతినిధి,జూన్ 30 (తెలంగాణ పత్రిక):

వెల్దుర్తి మండల కేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో జరుగుతున్న పదకొండవ వార్షికోత్సవాలు మంగళవారం మూడో రోజు అత్యంత వైభవంగా కొనసాగాయి. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో, రంగురంగుల పూలతో అలంకరించిన బోనాలను తలపై మోసుకుంటూ అమ్మవారికి ఘనంగా సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. బోనాల ఊరేగింపు గ్రామ ప్రధాన వీధుల గుండా అంగరంగ వైభవంగా సాగింది. డీజే సంగీతం, డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, భక్తుల జైజైధ్వానాలతో గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. మహిళలు భక్తిగీతాలు ఆలపిస్తూ బోనాలను మోసుకెళ్లగా, భక్తులు "జై రేణుకా ఎల్లమ్మ తల్లి" అంటూ నామస్మరణ చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించి కుటుంబ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కల్పించాలని వేడుకున్నారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు శస్యశ్యామలంగా పండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం బోనాల ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని, అదే సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా భక్తుల సహకారంతో ఘనంగా కొనసాగిస్తున్నామని గౌడ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు గ్రామ ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయి, భక్తి శ్రద్ధల మధ్య శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించి ఆశీర్వాదాలు పొందారు. మూడో రోజు ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో విజయవంతంగా కొనసాగాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వెల్దుర్తి ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు ఆలయ పరిసరాలు, ఊరేగింపు మార్గంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు సమర్థంగా నిర్వహించారు. పోలీసుల సేవలను గౌడ సంఘం నాయకులు అభినందిస్తూ, పటిష్ట బందోబస్తు కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సిఎంఆర్ చెక్కును పంపిణీ చేసిన దోమకొండ మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ మండల అధ్యక్షులు

కామారెడ్డి , జూన్ 30,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబర్పేట గ్రామానికి చెందిన రంగోల్ల స్వామి గౌడ్ ఇటీవల యాక్సిడెంట్ ప్రమాదంలో గాయపడిన విషయము తెలుసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 36000/- మంజూరు చేయించినందుకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ ఆదేశాల మేరకు ఈరోజు సిఎంఆర్ చెక్కును పంపిణీ చేసిన



దోమకొండ మాజీ జడ్పిటిసి తీగల తిరుమల్ గౌడ్, కాంగ్రెస్ దోమకొండ మండల అధ్యక్షులు ఆశ బోయిన శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు అనంతరెడ్డి. సీఎంఆర్ చెక్కు లబ్ధిదారు కు అందజేయడం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీకి ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఈశ్వర్ గౌడ్, ముత్యం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి చంద్రారెడ్డి, మైస గౌడ్, లింగ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష పేరుతో దళితులను దేవాలయాలోకి రానివ్వకపోవడం సిగ్గుచేటు

**-తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న**

కోటగిరి తెలంగాణ పత్రిక జూన్ 30 :




కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎస్సీలను ఈనెల 28వ తేదీ ఆదివారం రోజున గ్రామ దేవాలయంలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం చుస్తే దేశంలో దళితులకు ఇంకా స్వతంత్రం వచ్చిందా అన్న అనుమానం వస్తోందని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత అమానుషమని, రాజ్యాంగ విరుద్ధమని ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ ఖండించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ కుల వివక్ష పేరుతో దళితులను దేవాలయాల్లోకి రానివ్వకపోవడం దారుణమన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులను కాలరాస్తూ కొందరు అగ్రవర్ణాలవారు వ్యవహరిస్తున్న తీరు దురదృష్టకరమన్నారు. కొత్తపల్లి గ్రామంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన కొందరు వ్యక్తులు మాదిగలను గుడిలోకి రానివ్వకుండా అడ్డుకోవడం దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనలో బాధ్యులైన వారిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై వెంటనే స్పందించి బాధిత దళిత కుటుంబాలకు రక్షణ కల్పించడంతో పాటు, గ్రామంలో శాంతి భద్రతలను కాపాడాలని కోరారు. కుల వివక్ష, అంటరానితనం రూపుమాపేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పనిచేయాలని, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యతగా అయన తెలియజేశారు.

# దివ్యాంగుల హక్కుల అమలుకు కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆదర్శం

**-దివ్యాంగుల హక్కుల చట్టం--2016 బోర్డు ఏర్పాటు.. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**-రంగారెడ్డి జిల్లా,**

శేరిలింగంపల్లి, నియోజకవర్గం జూన్ 30, (తెలంగాణ పత్రిక)



దివ్యాంగులు సమాజంలో సమాన హక్కులు, సమాన అవకాశాలతో గౌరవప్రదమైన జీవనం సాగించేలా రూపొందించిన దివ్యాంగుల హక్కుల చట్టం 2016 అమలుపై ప్రజల్లో, ప్రభుత్వ అధికారుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని దివ్యాంగుల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ లక్ష్యంతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కొండాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం దివ్యాంగుల హక్కుల చట్టం 2016కు సంబంధించిన అవగాహన బోర్డును ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రకృష్ణ సహకారంతో శేరిలింగంపల్లి దివ్యాంగుల సమైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బోర్డు ద్వారా దివ్యాంగులకు చట్టం కల్పించిన హక్కులు, ప్రభుత్వ శాఖల బాధ్యతలు, అందించాల్సిన సేవలు, వివక్ష నిషేధం, అందుబాటు సౌకర్యాలపై స్పష్టమైన సమాచారం ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మేకల అశోక్ కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ, దేశంలో అత్యంత ప్రగతిశీల చట్టాల్లో ఒకటైన దివ్యాంగుల హక్కుల చట్టం 2016 అమలులో ఇంకా అనేక లోపాలు ఉన్నాయని అన్నారు. చట్టం అమలుపై సంబంధిత శాఖల అధికారులకు తగిన అవగాహన లేకపోవడం వల్ల దివ్యాంగులు తమ హక్కులను పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగులకు ప్రత్యేక ప్రవేశ మార్గాలు, వీల్‌చైర్ సౌకర్యం, మరుగుదొడ్లు, సమాచార బోర్డులు, సహాయక సేవలు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని చట్టం పేర్కొన్నప్పటికీ, అనేక చోట్ల అవి అమలు కావడం లేదన్నారు. దీనివల్ల ప్రభుత్వ సేవలను పొందడంలో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్, విద్యాసంస్థ, ప్రజా సేవల కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల చట్టం 2016కు సంబంధించిన అవగాహన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి చట్టంపై పూర్తి అవగాహన కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు. దివ్యాంగులను సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా సమాన హక్కులు కలిగిన పౌరులుగా గుర్తించి అన్ని ప్రభుత్వ నిర్ణయాల్లో వారికి ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సేవలు, విద్య, ఉపాధి, వైద్యం, రవాణా, ప్రజా భవనాలు తదితర రంగాల్లో దివ్యాంగులకు చట్టబద్ధంగా కల్పించిన హక్కులు పూర్తిస్థాయిలో అమలు కావాలంటే ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొండాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఈ అవగాహన బోర్డు ఇతర ప్రభుత్వ ఆసుపత్రులు, కార్యాలయాలకు ఆదర్శంగా నిలుస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. నరసింహాచారి, సదరం (యూడీఐడీ) డీఈఓ బి. నరసింహులు, దివ్యాంగుల నాయకులు సి.హెచ్. శివ, ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, వెంకటేష్, ఆరిఫ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు పిలుపునిచ్చారు.

**ప్రధాన డిమాండ్లు,**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగుల హక్కుల చట్టం 2016 అవగాహన బోర్డుల ఏర్పాటు. అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు దివ్యాంగుల హక్కులపై ప్రత్యేక శిక్షణ. ప్రభుత్వ భవనాల్లో అందుబాటు (యాక్సెసిబిలిటీ) సౌకర్యాల పూర్తి అమలు. దివ్యాంగుల పట్ల వివక్షను అరికట్టేందుకు కఠిన పర్యవేక్షణ. చట్టం అమలుపై ప్రతి శాఖలో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించడం. దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తానికి చెందిన బాధ్యత అని, చట్టం అమలులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్యక్రమంలో పాల్గొన్న వారు పిలుపునిచ్చారు..

# శ్రీ శ్రీ శ్రీ వీరాంజనేయ స్వామికి కిరీటం బహుకరించిన శంకరి లక్ష్మీ అనంతయ్య

తెలంగాణ పత్రిక న్యూస్ ప్రతినిధి శేర్లింగంపల్లి నియోజకవర్గం జూన్ 30.



శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్నపల్లి తండా గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ విరాంజనేయ స్వామివారి ఆలయంలో మంగళవారం ఉదయం కిరీట సమర్పణ మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. శంకరి లక్ష్మి, శంకరి అనంతయ్య దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పవిత్ర కిరీటాన్ని సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ కిరీట సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ శంకరి లక్ష్మి--అనంతయ్య దంపతులను దేవస్థాన కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించి, స్వామివారి ప్రసాదం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమానికి గోపన్నపల్లి తండాతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీ విరాంజనేయ స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు, శంకరి లక్ష్మి--అనంతయ్య కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల బహుమతి

**-'రహవీర్' -- పీఎం రహత్ పథకాలపై కామారెడ్డి జిల్లాఅడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) సమీక్ష**


కామారెడ్డి ,జూన్ 30,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహవీర్ 'పీఎం రహత్ ' పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్ పథకాల అమలు తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు స్పందించి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తొలి గంట (గోల్డెన్ అవర్)లోపు బాధితుడిని ఆసుపత్రికి చేర్చి ప్రాణాలను కాపాడిన వారికి కేంద్ర ప్రభుత్వం తరపున రూ.25,000 నగదు బహుమతి అందజేస్తుందని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.1.5 లక్షల వరకు ఉచిత (క్యాష్‌లెస్) వైద్యం అందించే పీఎం రహత్ పథకం అమలులో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స. ప్రమాదం జరిగిన తేదీ నుంచి 7 రోజుల వరకు ఉచిత వైద్యం. గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు వైద్య ఖర్చుల భారం ప్రభుత్వం భరిస్తుంది. జాతీయ రహదారులు మాత్రమే కాకుండా, ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా ఈ పథకం వర్తిస్తుంది. లబ్ధిదారులురోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రతి బాధితుడు. ప్రమాద బాధితుడికి వెంటనే సహాయం చేసిన వారికి ప్రోత్సాహకంగా రూ.25,000 బహుమతి. పోలీసులు లేదా కోర్టుల ఇబ్బందుల భయం అవసరం లేదు. సహాయం చేసిన వారి హక్కులకు చట్టపరమైన రక్షణ ఉంటుంది. ఒక వ్యక్తి సంవత్సరానికి గరిష్ఠంగా ఐదు సార్లు బహుమతి పొందే అవకాశం ఉంది. లబ్ధిదారులు: ప్రమాద బాధితుడిని సకాలంలో ఆసుపత్రికి చేర్చిన సహాయకుడు. అప్రిసియేషన్ కమిటీ సమావేశం ఈ సందర్భంగా నిర్వహించిన అప్రిసియేషన్ కమిటీ సమావేశానికి అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) వి. విక్టర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్, జిల్లా రవాణా అధికారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడే ఏత్తొండకు మంత్రి పొన్నం ప్రభాకర్ రాక

కోటగిరి తెలంగాణ పత్రిక జూన్ 30.




కోటగిరి మండలంలోని ఏత్తొండ గ్రామానికి బుధవారం నాడు ఉదయం 11 గంటలకు రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బీసీ శాఖ మరియు రవాణాశాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షేట్కార్, తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, నిజామాబాద్ మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి విచ్చేయుచున్నారని కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షాహిద్ హుస్సేన్ తెలిపారు . ఈ కార్యక్రమానికి ఏఎంసి చైర్మన్ వివిధ గ్రామాల సర్పంచ్ లు మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపీటీసీలు సహకార సంఘాల చైర్మన్లు ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# మెరుగైన వైద్యం అందించాలి

**-జిల్లా కలెక్టర్ కె.హైమవతి**



సిద్దిపేట జిల్లా ప్రతినిధి , జూన్ 30 (తెలంగాణ పత్రిక)

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓ పి రిజిస్టర్, అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. మెడికల్ ఆఫీసర్ మరియు మెరుగైన వైద్యం అందించాలనిసిఎచ్ఓ - సూపర్ వైజర్ లు ఫీల్డ్ లో ఉన్నట్లు సిబ్బంది తెలపగా వారికి వీడియో కాల్ లో ... ఫీల్డ్ ఉన్నారా అని నిజనిర్ధారణలో గ్రామాల్లో ఇంటింటికి పోలియో చుక్కల వేసే కార్యక్రమం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కి తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళితే తప్పనిసరిగా పి హెచ్ సి కి వచ్చి అటెండెన్స్ రిజిస్టర్లో సంతకం పెట్టాకే ఫీల్డ్ కి వెళ్లాలని, ఫీల్డ్ వివరాలు సైతం అటెండెన్స్ రిజిస్టర్ లో మెన్షన్ చేయాలని మెడికల్ ఆఫీసర్ ను హెచ్చరించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని మెడికల్ పరికరాలు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

# సిఐటియులో చేరిన విద్యుత్ రంగ ఉద్యోగులు కార్మికులు

**-కార్మికులను వేధిస్తే ఊరుకోం రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ రావు**



కామారెడ్డి, జూన్ 30,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోమంగళవారం విద్యుత్ రంగా కార్మికులు సిఐటిలో చేరారు. కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది ఇందులో రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వరరావు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ జిల్లా అధ్యక్షులు గంగాధర్ జిల్లా సెక్రెటరీ మోహన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్ గౌడ్ గారు మరియు ఇతర డివిజన్ ప్రెసిడెంట్లు మరియు సెక్రెటరీ మరియు జిల్లా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో వివిధ ట్రేడ్డేడ్ యూనియన్ లో నుంచి కార్మికులు సిఐటియులో చేరడం జరిగింది ఈ సమావేశంలో ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ రావు కార్మికుల సమస్యల పైన సిఐటి ముందుంటుందని వారికి ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ముందుండి వారి సమస్యలను తీరుస్తుందని పేర్కొనడం జరిగింది ఇందులో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ నర్సాగౌడ్ బాలరాజు లైన్మెన్ బాలేశం ఎం నర్సింలు రాఘవచారి దేవదాస్ అశోక్ రెడ్డి బి రవికుమార్ ప్రశాంత్ ప్రతాప్ నరేష్ ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రెండో విడత పకడ్బందీగా చేయాలి



ముధోల్:30జూన్(తెలంగాణ పత్రిక)

ఇందిరమ్మ రెండో విడత ఇండ్ల సర్వేను వేగవంతంగా చేయాలని ఎంపీడీవో లవ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో తిరుగుతూ అర్హులైన వారిని గుర్తించాలని అన్నారు. ఇందిరమ్మ రెండో విడత లో భాగంగా గుడిసెలు, రేకుల ఇండ్లను గుర్తించి పూర్తి సమాచారాన్ని సేకరించాలని సూచించారు. అర్హులైన వారికి ఇందిరమ్మ మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలి"

-బిఎల్ఓ చేతుల మీదుగా సర్ఎన్యూమరేషన్ ఫారం స్వీకరించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు



కామారెడ్డి, జూన్ 30,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు బి ఎల్ ఓ చేతుల మీదుగా సర్ ఎన్యూమరేషన్ ఫారాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి పౌరుడు తప్పనిసరిగా సర్ ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి ఓటరు జాబితాలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రతి ఓటరు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి సేవలందిస్తున్న డి ఎల్ వో బిఎల్ఎలకు అవసరమైన సహకారం అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ సకాలంలో ఫారాలను పూర్తి చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో, స్థానిక నాయకులు, ఎన్నికల సిబ్బంది, డిఎల్ఓలు, బి ఎల్ ఏలు తదితరులు పాల్గొన్నారు.

## లెవెల్-1 అథ్లెటిక్స్ కోచ్‌గా అర్హత సాధించిన

-నాగేంద్రకు ఎమ్మెల్యే కూనంనేని అభినందనలు...



తెలంగాణ పత్రిక జూన్ 30 ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం: ఇటీవల బెంగళూరులో వరల్డ్ అథ్లెటిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన లెవెల్-1 అథ్లెటిక్స్ కోచ్ శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ కనబర్చి లెవెల్-1 అథ్లెటిక్స్ కోచ్‌గా అర్హత సాధించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్రను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నైపుణ్యం కలిగిన శిక్షకుల వద్ద శిక్షణ పొందిన అథ్లెట్లు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి పతకాలు సాధించే అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. వరల్డ్ అథ్లెటిక్స్ నిర్వహించే ఇలాంటి కోచింగ్ కోర్సుల ద్వారా కోచ్‌లు తమ సాంకేతిక నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుని క్రీడాకారులకు శాస్త్రీయ శిక్షణ అందించగలరని పేర్కొన్నారు. నాగేంద్ర సేవలను జిల్లా అథ్లెటిక్స్ అభివృద్ధికి వినియోగించుకోవాలని, ఆయన శిక్షణలో మరింత మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే. షాబీర్ పాషా మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వరుసగా రెండుసార్లు రాష్ట్ర సీఎం కప్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌ను సాధించడంలో కోచ్ నాగేంద్ర కృషి ఎంతో కీలకమైందన్నారు. ఆయన మరింత పట్టుదలతో వరల్డ్ అథ్లెటిక్స్ లెవెల్-1 కోచింగ్ కోర్సులో ఉత్తీర్ణత సాధించడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్, కేటీపీఎస్ ఏ డీఈ తోకల రామదాస్, పీడీ శ్వేత తదితరులు కోచ్ నాగేంద్రను అభినందించారు.

## ఓటర్ జాబితాలో మన పేరు ఉందో లేదో పరిసరించడం ప్రతి పౌరుడు బాధ్యత

# కీసరీ రమ (వార్డ్ మెంబర్ )అయ్యావారి పేట

వాజేడు తెలంగాణ పత్రిక జూన్ 30.

వాజేడు మండలంలోని ఆయా గ్రామాలలో ఓటర్ జాబితా ప్రక్రియ వేగవంతం. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ఓటర్ల మ్యాపింగ్, ఎమ్యూనరేషన్ ఫారాల వంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా .బీఎల్ఎలు ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. చనిపోయిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లు, నకిలీ ఓట్లను గుర్తించి తొలగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అదే సమయంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన యువతకు కొత్త ఓటు నమోదు చేసే అవకాశం కల్పించాలని తెలిపారు. ప్రతి కుటుంబం బీఎల్ ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా తీసుకొని, తమ వివరాలను పూర్తిగా, సక్రమంగా నమోదు చేసి తిరిగి అందజేయాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ స్వయంగా వరిశీలించుకోవడం ప్రజాస్వామ్య పట్ల ప్రతి పౌరుడి బాధ్యత అని



పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా నిజమైన ఓటర్లను గుర్తించడం, కుటుంబాల వారీగా ఓటర్ల మ్యాపింగ్ నిర్వహించడం, కొత్త ఓటర్లను చేర్చడం, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేయడం జరుగుతుందని తెలిపారు. నాయకులు, బీఎల్ఎలు, బీఎల్ ఓలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలు ఈ సవరించిన ఓటరు జాబితా ఆధారంగానే నిర్వహించబడనున్నందున ప్రతి ఒక్కరు బి. ఎల్. ఓ ,వాళ్లకు సహకరించా తెలియజేయడం జరిగింది. బీఎల్ఎలతో కలిసి ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. పాత ఓటరు జాబితాలను పరిశీలిస్తూ ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేసి, చనిపోయిన వారి పేర్లు, డూప్లికేట్ ఓట్లు, నకిలీ ఓట్లను గుర్తించి తొలగించే ప్రక్రియకు కార్యక్రమం జూలై 24, కొనసాగనున్నందున ప్రతి అర్హత కలిగిన ఓటరు సహకరించాలని అన్నారు. ఈ వరకు తప్పనిసరిగా ఇందులో భాగస్వామి కావాలని, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కీసరి రమా (వార్డ్ మెంబర్) విజ్ఞప్తి చేశారు. అనంతరం బీఎల్ ఓలు, బీఎల్ఎలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు ఎమ్యూనరేషన్ ఫారాలను పంపిణీ చేస్తూ, ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో కీలకమని ఈ సందర్భంగ ఆమె పేర్కొన్నారు.

# సర్ విజయమే లక్ష్యం.. ఎమ్మెల్యే మదన్మోహన్ రావు

-డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ దిశానిర్దేశం

కామారెడ్డి, జూన్ 30,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే లక్ష్యంగా కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ,కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్మోహన్ రావు మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయడంతో పాటు ప్రజలకు సర్ కార్యక్రమంపై పూర్తి



అవగాహన కల్పించాలని కోరారు. డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు వెన్నెముక వంటిదని పేర్కొన్నారు. ఒక్క అర్హుడైనా ఓటరు జాబితా నుంచి మిగిలిపోకుండా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ప్రతి కుటుంబానికి చేరువ కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగవంతంగా అమలు చేయడం, ఓటరు నమోదు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, పార్టీ శ్రేణులు మరియు అధికారుల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించి కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అలాగే, ఎమ్మెల్యే మదన్మోహన్ రావు , డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ నాయకత్వంలో సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి జనరల్ సెక్రటరీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ సర్ఇన్‌చార్జ్ నందిమల్ల యాదయ్య బి ఎల్ ఎ మాస్టర్ ట్రైనర్ నరేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మసీ ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తా: డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా

-టీజీపీఓఏ ఆధ్వర్యంలో నూతన డీఎంహెచ్ఓకు ఘన సన్మానం

సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30, తెలంగాణ పత్రిక

ఫార్మసీ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఏంజెలా తెలిపారు.తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలాను ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి టీజీపీఓఏ అధ్యక్షులు వెంకన్న, రాజ్యం హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ ఏంజెలాకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ఫార్మసీ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సంఘ ప్రతినిధులు డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్లారు.ప్రధానంగా ఆల్టర్నేటి



వ్ కోల్డ్ చైన్ హ్యాండ్లర్ కేటాయింపు, ఈ-ఔషధి డాటా ఎంట్రీలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఫార్మసీ ఆఫీసర్లు సెలవులో ఉన్న సమయంలో ఫార్మసీ స్టోర్ ఇన్‌చార్జి బాధ్యతలు, ఈ-ఔషధి, ఈ-విన్ తదితర విధులను ఇతర సిబ్బందికి అప్పగించే అంశాలపై చర్చించారు. ఫార్మసీ ఆఫీసర్లపై ఉన్న పని భారం గురించి కూడా వివరించారు.ఈ సమస్యలపై స్పందించిన డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా.. ఫార్మసీ ఆఫీసర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సాధ్యమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఫార్మసీ ఆఫీసర్ల సహకారం కీలకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజారోగ్య వ్యవస్థలో ఫార్మసీ ఆఫీసర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారి సమస్యలు పరిష్కారమైతే ప్రభుత్వ వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని అన్నారు. ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవల అందజేత అనే లక్ష్యాలతో సంఘం నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏవో డాక్టర్ అనిత, డీఐఓ డాక్టర్ సంపత్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమాదేవి, రజని, ఉపాధ్యక్షురాలు రమ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీకాంత్, జాయింట్ సెక్రటరీ సిరి చందన తదితరులు పాల్గొన్నారు. ఫార్మసీ ఆఫీసర్ల సమస్యల పట్ల నూతన డీఎంహెచ్ఓ సానుకూలంగా స్పందించడంపై జిల్లా ఫార్మసీ ఆఫీసర్లు, సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పెట్టుబడి

-పాఠ్యపుస్తకాల పంపిణీతో పాటు జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన నిజాంసాగర్

-కామారెడ్డి డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్

కామారెడ్డి , జూన్ 30,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గనిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈరోజు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొని, తమ చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలతో చదువులో రాణించాలని ఆకాంక్షించారు. పుస్తకాలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా 2025--2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కామారెడ్డి జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన నిజాంసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందాన్ని డీసీసీ అధ్యక్షులు ఏలే



మల్లికార్జున్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించగలవని ఈ విజయం నిరూపించిందని కొనియాడుతూ, విద్యార్థుల విజయానికి కృషి చేసిన అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకు లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వి ద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతు భరోసా పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి

కామారెడ్డి , జూన్ 30,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం రైతుల సౌకర్యార్థం రైతు భరోసా పథకాన్ని ప్రారంభించి రైతుల ఖాతాల్లో నిధులు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ రామారెడ్డి మండలం లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి కార్యక్రమం లో పాల్గొని మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడం, రైతులకు పెట్టుబడి వ్యయభారం తగ్గించడం, సాగుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతు భరోసా పథకాన్ని ప్రారంభించడం రైతాంగానికి శుభపరిణామమని అన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా ఆర్థిక సాయం జమ చేయడం వల్ల పారదర్శకతతో పాటు సకాలంలో పెట్టుబడి అందే అవకాశం కలుగుతుందని తెలిపారు. జిల్లాలో





2025--26 వానాకాలం సీజన్‌లో 10,851 మంది రైతులకు రూ.9,35,33,533 రైతు భరోసా నిధులు జమయ్యాయని, అలాగే 2025--26 యాసంగి సీజన్‌లో 10,950 మంది రైతులకు రూ.7,34,81,576 ఆర్థిక సహాయం అందించామని వెల్లడించారు. రెండు ఎకరాలు ఉన్న వారికి రైతుల ఖాతాలో ఇప్పుడు జమ అవుతాయని, మిగితా 9 రోజుల్లో జమ అవుతాయని అన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు రైతు భరోసా సాయం అందేలా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తులు, అర్హతల పరిశీలన, నిధుల జమ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయ ఉత్పాదకతను పెంచడంతో పాటు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ గిరి, డిప్యూటీ ట్రయిని కలెక్టర్ రవితేజ, ప్రవీణ్ గౌడ్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామారెడ్డి ఉప సర్పంచ్ నవీన్, సుధా మాధూరి, సర్పంచ్ ప్రవీణ్, మోహన్, తహసీల్దార్ సుమలత, మావోయిస్టు భాను శ్రీ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# రుచికరంగా వండి... విద్యార్థులకు కడుపునిండా వడ్డించాలి

-జిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, జూన్ 30 (తెలంగాణ పత్రిక):

మధ్యాహ్నం భోజనం కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని, వండిన ప్రతి వంటకం రుచికరంగా విద్యార్థులకు కడుపునిండా వడ్డించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. చిన్నకోడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, సాంబారు, వంకాయ ఆలుగడ్డ టమాట అన్ని కలిపిన కూర లను తనిఖీ చేస్తూ విద్యార్థులు హాజరు ప్రకారం కూరగాయలు కొలత ప్రకారం తీసుకున్నారా విద్యార్థులకు సరిపోతుందా అరా తీశారు. చేసిన ప్రతి వంటకం విద్యార్థులకు సరిపోయేంత వండి వడ్డించాలని లేనియెడల సహించేది లేదని హెచ్చరించారు.





అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం చేస్తూ విద్యార్థులతో ఆప్యాయంగా పలకరిస్తూ భోజనం ఎలా ఉంది, రోజు ఎలా పెడుతున్నారు, మెనూ పాటిస్తున్నారా, అందరికి సరిపోతుందా అని అడగ్గా బాగుంటుందని అందరికీ సరిపోతుందని విద్యార్థులు కలెక్టర్కు తెలిపారు. ఆహార పదార్థాలను బాగా నమిలి తినాలని అన్నం పరబ్రహ్మ స్వరూపమని వృధా చేయకుండా శుభ్రంగా తినాలని సూచించారు. శారీరకంగా దృఢంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉంటారని అన్ని కూరగాయలు ఇష్టంగా తినాలని తెలిపారు. కూరల నాణ్యత మరియు రుచి మెరుగుపరచాలని కూరలో ఇష్టానుసారంగా ఉప్పు- కారం తో ఎలా ఉన్నా పిల్లలు ఏం అడగకుండా తింటారని నిర్లక్ష్యం వైఖరి సహించేది లేదని, ప్రతిదీ సమపాళ్లల్లో వేసి విద్యార్థులకు పెట్టాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సలీం తదితరులు ఉన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఆధ్వర్యంలో ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ కి సన్మానం

-గిరిజన ప్రాంతంలో ప్రత్యేక వైద్య కేంద్రంలో
-కేన్సర్ నిర్ధారణ కొరకు చర్యలు చేపడతాం.. పీవో

(తెలంగాణ పత్రిక) జూన్ 30 ఖమ్మం

భద్రాచలం పట్టణంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ బి.రాహుల్ ని కలిసి, ప్రతిష్టాత్మకమైనటువంటి "దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టు ఆఫీసర్"గా "జాతీయ గౌరవం - గుర్తింపు" పొందిన ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్ ని సన్మానించారు. ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా గిరిజన ప్రాంతంలో అమలు పర్చినందుకు ట్రైబల్ వెల్ఫేర్ మ్యూజియం స్థాపించినందుకు, విద్యాశాఖలో, వైద్యశాఖలో వినూత్నమైనటువంటి పథకాలను అమలుపర్చి నందుకు, వారికి గుర్తింపు రావడం గర్వకారణం, గిరిజన సంక్షేమం కొరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన అంధత్వ నివారణ, కేన్సర్ నివారణ శిబిరాలను నిర్వహించుటకు పీవో సహాయ సహకాల వలన 2500 మందికి కంటి ఆపరేషన్లు, 400 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం వలన అందరికీ కంటి చూపు మెరుగుపడిందని, వైద్యసేవలు మెరుగు పడినాయని రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ డా" ఎస్.ఎల్.కాంతారావు తెలిపారు. గిరిజన ప్రాంతంలో వైద్యసదుపాయాలు విస్తృత పర్చుటకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాలతో సెక్రటరీ టు గవర్నర్ దాన కిషోర్, రాష్ట్ర ఐఆర్సిఎస్ కార్యదర్శి ఎ. శ్రీరాములు సూచనలతో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ , అడిషనల్ డైరెక్టర్ డి. వేణుగోపాల్ పాల్వంచలో రెడ్ క్రాస్ సంస్థ భవన నిర్మాణానికి 0.10 జిటిఎస్ స్థలాన్ని కేటాయించినారని, ఈ స్థలం నందు ప్రత్యేక వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని, అందులో ఉచిత కేన్సర్ నిర్ధారణ, ఉచిత డయాలసిస్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని దీని వలన గిరిజన సంక్షేమం, వైద్య సదుపాయలు విస్తృతపరచాలని కోరగా, ప్రాజెక్టు ఆఫీసర్ వెంటనే స్పందించి తగు చర్యలు చేపడతామని తెలపగా,



వారికి రెడ్ క్రాస్ తరపున డా" ఎస్.ఎల్.కాంతారావు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా" ఎస్.ఎల్.కాంతారావు జిల్లా కో-ఆర్డినేటర్, డా"యం. వి. కోటిరెడ్డి, డా"భాను ప్రసాద్, రొటేరియన్ కె. అబ్రహాం, లయన్ గాదె మాధవరెడ్డి , లయన్ చావా లక్ష్మీనారాయణ, డా" పి.రాజశేఖర్, లయన్ వై. సూర్యనారాయణ, రొటేరియన్ జి, రాజారెడ్డి, ఆదినారాయణ, వి కామేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

-విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలకు రాయబారులుగా మారాలి.
-పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.

(తెలంగాణ పత్రిక) జూన్ 30 కరీంనగర్ :

నగరంలోని జ్యోతినగర్‌లో ఉన్న సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన బీ సేఫ్ - సేఫ్టీ అవేర్నెస్ ఫర్ ఎవ్రీవన్ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ముఖ్య అతిథిగా పాల్గొని రోడ్ సైన్ చార్ట్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక శాతం మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని తెలిపారు. విద్యార్థులు 18 సంవత్సరాల వయస్సు పూర్తయ్యే వరకు, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ పొందే వరకు ఎలాంటి




మోటారు వాహనాలు నడపకూడదని సూచించారు. ట్రాఫిక్ నియమాలను తాము పాటించడమే కాకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులకు కూడా అవగాహన కల్పించి రోడ్డు భద్రతకు రాయబారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నిర్వహించిన రోడ్డు భద్రత క్విజ్ పోటీలో సరైన సమాధానాలు చెప్పిన విజేతలకు కమిషనర్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలను బహుమతులుగా అందజేసి అభినందించారు. అలాగే పాఠశాల విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఐవైఎస్ఓ టీమ్ ఇండియా మరియు సేఫ్ ఇండియన్ రోడ్స్ సభ్యుల సేవలను కమిషనర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్ రెడ్డి, విశ్వనాథ్ బలరామ్, ఘనశ్యామ్ ఓజా (సీఈఓ, ఐవైఎస్ఓ టీమ్ ఇండియా ౚ యంగ్ ఇండియా మిషన్), రూపక్ ముండాడా, మొహమ్మద్ అబ్దుల్ అస్లాం, అమీనా, పాఠశాల ఉపాధ్యాయులు, సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్‌బీ డీఎస్పీ వెంకటరమణకు ఘన సన్మానం



తెలంగాణ పత్రిక జూన్ 30జగిత్యాల:

జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటరమణ ఉద్యోగ విరమణ సందర్భంగా జగిత్యాల పట్టణంలోని వీకేబీ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై వెంకటరమణ ను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్ శాఖలో వెంకటరమణ ఎన్నో సంవత్సరాల పాటు అంకితభావంతో, నిజాయితీతో, క్రమశిక్షణతో సేవలందించారని కొనియాడారు. తన విధి నిర్వహణలో సమర్థత, బాధ్యతాయుతమైన వ్యవహారశైలి, సహోద్యోగులతో సత్సంబంధాలు కలిగి శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు.ఉద్యోగ విరమణ అనేది సేవా జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజ సేవకు కాదని ఎస్పీ అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో కలిసి సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సహచర అధికారులు, పోలీస్ సిబ్బంది వెంకటరమణ తో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన సేవలను ప్రశంసించారు. అనంతరం పుష్పగుచ్చాలు అందించి, శాలువాతో సత్కరించి, జ్ఞాపికను బహూకరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్,సుధాకర్,కరుణాకర్,రవి,లక్ష్మీనారాయణ,వేణు,ఎస్. ఐ లు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య బోధన్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక




(తెలంగాణ పత్రిక) బోధన్, జూన్ 30 :

బోధన్ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియను మంగళవారం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. బోధన్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఈ ఎన్నిక ప్రక్రియ కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో కొనసాగింది. ఎక్స్ అఫిషియో సభ్యుని హోదాలో ప్రభుత్వ సలహాదారు, స్థానిక ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలో పాల్గొన్నారు. సరిపడా కోరంను నిర్ధారించుకున్న మీదట ఎన్నిక ప్రక్రియను ప్రారంభించారు. ఎక్స్ అఫిషియోను కలుపుకుని మొత్తం 39 మందికి గాను, పూర్తి స్థాయిలో 39 మంది సభ్యులు హాజరయ్యారు. ఆయా కేటగిరీల వారీగా కో ఆప్షన్ పదవి కోసం వచ్చిన ప్రతిపాదనల మేరకు పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా నలుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియను ప్రిసైడింగ్ ఆఫీసర్ ప్రకటించిన తదుపరి 12 మంది ఎంఐఎం కౌన్సిలర్లు ఎన్నికను బహిష్కరిస్తున్నామని ప్రకటించి సమావేశం హాల్ నుండి బయటకు వెళ్లిపోయారు. మిగతా సభ్యులతో ఎన్నిక ప్రక్రియను కొనసాగించారు. నాలుగు కోఆప్షన్ పదవులకు గాను మొత్తం 35 దరఖాస్తులు రాగా, పేర్లను చదువుతూ, చేతులు ఎత్తే పద్ధతి ద్వారా కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకున్నారు. ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా నిబంధనలను పక్కాగా పాటిస్తూ, వీడియో చిత్రీకరణ మధ్య పూర్తి పారదర్శకంగా ఈ ఎన్నిక ప్రక్రియ జరిపించారు. మెజారిటీ సభ్యుల (19 మంది) మద్దతు మేరకు దండు సంగ్రామ్, మాసుల లక్ష్మి, మహమ్మద్ ఇమ్రాన్, రఫీయా బేగంలు కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ జాదవ్ కృష్ణ ప్రకటించారు. నూతనంగా కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన వారికి నియామక ధృవీకరణ పత్రాలు అందజేశారు. కో ఆప్షన్ ఎన్నికను పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులకు ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందలు తెలియజేశారు. ఈ ఎన్నిక ప్రక్రియలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా నినాదం



## వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతాం

-రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



(తెలంగాణ పత్రిక)జూన్ 30 ఖమ్మం

రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక నుండి రైతు భరోసా లో భాగంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమానికి హాజరై, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకాటి శ్రీహరి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని రైతు వేదికల ద్వారా జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఇట్టి కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయగా, చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులను ఒక్కొక్కటిగా సరి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ లో భాగంగా 25 లక్షల 35 వేల మంది రైతులకు 20 వేల 677 ఓట్ల రూపాయలు రుణమాఫీ చేయడం జరిగిందని, రైతు భరోసాలో భాగంగా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు 27 వేల కోట్ల రూపాయల రైతు భరోసా రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ప్రస్తుతం 9 వేల కోట్ల రూపాయలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మొత్తంగా 36 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కొరకు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగానికి 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, 4 వేల కోట్ల రూపాయల బోనస్, 2 వేల కోట్ల రూపాయలతో పనిముట్లు, రైతు భీమా పథకం కొరకు 3 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా రైతుల వద్ద నుండి 2 లక్షల 88 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 80 వేల కోట్ల రూపాయలు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 1 లక్ష 75 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగం కోసం ఖర్చు చేయడం జరిగిందని, సరాసరి ప్రతి నెల 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. నష్టాలలో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను 1 వేయి కోట్ల లాభాలలోకి తీసుకురావడం జరిగిందని, సింగరేణి, విద్యుత్, ఆర్థిక, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయడం జరిగిందని, రెవెన్యూ శాఖలో భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా మహాలక్ష్మి పథకంలో రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు 11 వేల కోట్ల రూపాయలు ఆర్ టి సి సంస్థకు చెల్లించామని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ, పెట్రోల్ బంకులు నడిపించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, హైదరాబాద్ లోని ఐ.టి. సంస్థల మధ్య 1 వేయి కోట్ల రూపాయల భూమిని ఇందిరా మహిళ భవన్ కు కేటాయించి స్వయం సహాయక సంఘాల ద్వారా 150 షాపులు ఏర్పాటు చేసి నిర్వహణకు అవకాశం కల్పించడం జరిగిందని, రాష్ట్రంలో దాదాపు 8 వేల స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఒకేసారి సమావేశం నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రాలలో ఇందిరా మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా గ్రూప్ 1 నిర్వహించి 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని, గ్రూప్ 2 లో 1 వేయి 100 మంది, అన్ని ప్రభుత్వ శాఖలలో దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి కాలానుగుణంగా దిగుబడి వచ్చే పంట సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా ప్రభుత్వమని, ప్రతి రంగానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నాగులవంచ రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్..
-సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్..

(తెలంగాణ పత్రిక)జూన్ 30 ఖమ్మం





సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఆర్ సీఓ లతో హాస్టళ్ల నిర్వహణ, మౌళిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్,డార్మెటరీ, ఫర్నిచర్, వంటశాల, డైనింగ్ హాల్, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాల స్థితిని పరిశీలించి, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి లోపాలను వెంటనే గుర్తించి, నివేదిక సమర్పించాలని, తదనుగుణంగా ఆయా సంక్షేమ అధికారులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థకు జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిచెన్, టాయిలెట్ వ్యర్థాలు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఇంకుడుగుంతల నిర్మాణాలు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పాఠశాలల పరిస్థితులను మెరుగ్గా తీర్చిదిద్దినట్లు, వసతిగృహాల మరమ్మతులకు నిధుల మంజూరికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రతి సంక్షేమ శాఖ లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అధ్వాన్న స్థితిలో ఉన్న వసతి గృహాన్ని ఎంపికచేసి, పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే విధంగా చర్యలకు నిధుల గురించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వర్షాకాలం కావున అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డోర్లు, కిటికీలు వైర్ మెష్ ఏర్పాట్లు, టాయిలెట్లమరమ్మత్తులు, నీటి నిల్వ లేకుండా చర్యలు వెంటనే చేయాలన్నారు. ఆహారం విషయంలో జిల్లాలో ఎక్కడ ఫుడ్ పాయిజన్ సమస్య ఉత్పన్నం కావడానికి వీలులేదని, ఎక్కడైనా సంఘటన జరిగితే కఠినచర్యలు వుంటాయని కలెక్టర్ అన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు దగ్గరలోని వసతి గృహాలను మ్యాపింగ్ చేయాలన్నారు. వసతి గృహాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత గ్రీవెన్స్ లలో అడ్మిషన్లు, బదిలీల కొరకు వచ్చిన దరఖాస్తులకు మిగులు సీట్లలో అవకాశం కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా బిసి, సాంఘీక సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, ఆయా శాఖల ఆర్ సీఓ లు, విద్యుత్ శాఖ ఏవో కె. శ్రీధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్రముప్పు..

జులై 3న ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు ప్రయత్నించే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు అప్రమత్తం చేసినట్లు సమాచారం. దీంతో యాత్ర మార్గమంతా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రాంతాల్లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేయవచ్చని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నిఘా సంస్థలు గుర్తించిన సమాచారం ప్రకారం.. జమ్ముకశ్మీర్‌లో అడవుల్లో దాక్కున్న కొంతమంది ఉగ్రవాదులతో పాక్ మూకలు సంప్రదింపులు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. పెద్దఎత్తున దాడులు జరిపేలా వారిని ప్రేరేపించే యత్నాలు జరుగుతున్నాయని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. ఈ హెచ్చరికల నేపథ్యంలో యాత్ర మార్గంలో భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించారు. ఉగ్రవాద వ్యతిరేక నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేశారు. అత్యాధునిక కృత్రిమ మేధ ఆధారిత కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇదే సమయంలో జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. బలగాలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, యాత్రికులు అధికారిక సూచనలు పాటించాలని, వదంతులను నమ్మొద్దని భద్రతా వర్గాలు సూచిస్తున్నారు.

## భారత నూతన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ధీరజ్ సేథ్

భారత సైన్యానికి నూతన అధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దేశ 31వ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది స్థానంలో.. కొత్త ఆర్మీ చీఫ్ కమాండ్ చేపట్టారు. ఆర్మోర్డ్ కార్ప్స్ (ట్యాంక్ రెజిమెంట్) విభాగం నుంచి ఆర్మీ చీఫ్ పదవిని అధిష్ఠించిన 7వ అధికారిగా ధీరజ్ సేథ్ రికార్డు సృష్టించారు. సౌత్ బ్లాక్ లాన్స్‌లో సైనిక సంప్రదాయాల మధ్య అధికారికంగా కొత్త ఆర్మీ చీఫ్ బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఆర్మోర్డ్ కార్ప్స్‌లో (2అ౦ ఘఅషవతీం) కమిషన్డ్ అధికారిగా జనరల్ ధీరజ్ సేథ్ ప్రస్థానం ప్రారంభించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద నిరోధక దళానికి కమాండర్‌గా పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఆయనకు ఉంది. సైన్యంలో కీలకమైన సదరన్ కమాండ్, సౌత్ వెస్ట్రన్ కమాండ్.. రెండింటికీ ఆర్మీ కమాండర్‌గా ధీరజ్ సేథ్ వ్యవహరించారు. రక్షణ విభాగంలో ప్లానింగ్, కేపబిలిటీ డెవలప్‌మెంట్‌లో విశేష అనుభవం.. సైన్యం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు.

## పాల్వంచలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై ఉక్కుపాదం మోపాలి

-అధిక ఫీజులు,బలవంతపు కొనుగోళ్లతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం
-నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి
-డీఈఓకు ఫిర్యాదు చేసిన బీజేపీ నేత పొనిశెట్టి వెంకటేశ్వర్లు

(తెలంగాణ పత్రిక)జూన్ 30 :



కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నాయని బీజేపీ నాయకుడు పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలు, అధిక ఫీజుల వసూళ్లు, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కి మంగళవారం ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాల్వంచలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ మార్గదర్శకాలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అడ్మిషన్ ఫీజు,ట్యూషన్ ఫీజు,వార్షిక ఫీజు పేర్లతో వేలాది రూపాయలు వసూలు చేయడంతో పాటు యూనిఫార్మ్‌లు, పాఠ్యపుస్తకాలు,నోట్‌బుక్స్, బ్యాగులు,షూస్,సాక్స్ తదితర వస్తువులను పాఠశాలల్లోనే లేదా యాజమాన్యం సూచించిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని విమర్శించారు.నర్సరీ, ఎల్‌కేజీ,యూకేజీ వంటి చిన్నారులకు కూడా అవసరానికి మించిన పుస్తకాలు,నోట్‌బుక్స్ పేరుతో రూ.4వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి అమాయక తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. అనేక ప్రైవేట్ పాఠశాలల్లో పార్కింగ్ సౌకర్యం, ఆటస్థలాలు,స్వచ్ఛమైన తాగునీటి వసతి,అగ్నిమాపక భద్రత,భవన భద్రత వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని ఆరోపించారు. అయినప్పటికీ భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రతను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.కొన్ని మైనారిటీ విద్యాసంస్థలు ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన స్థలాల్లో వాణిజ్య భవనాలు నిర్మించి అద్దెలకు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారి పిల్లలపై వివక్ష చూపుతున్నారని,దీంతో చాలామంది తల్లిదండ్రులు భయంతో ముందుకు రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.విద్య అనేది వ్యాపారం కాదని, సమాజ నిర్మాణానికి పునాదని పేర్కొన్నారు.పాల్వంచలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ఫీజుల నియంత్రణ,మౌలిక వసతులు,భద్రతా ప్రమాణాల అమలుపై సమగ్ర పరిశీలన చేపట్టాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే ఆయా పాఠశాలల గుర్తింపును కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టి పాల్వంచలో జరుగుతున్న విద్యా దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దున్నపోతుల రాజు,భూక్యా మోహన్,మాలోత్ ప్రశాంత్, భట్టు అశోక్,గొళ్ల శ్రీమాన్ నారాయణ,కనకాల క్రాంతి, సంకినేని రుద్,అజ్మీరా హాథిరామ్,కొత్తపల్లి విజయ్, బియ్యని విజయ్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143